ఈనాడు సూర్యాపేట

గురువారం 24 ఆగస్టు 2017 16 పేజీలు

పర్యావరణ హితంపై శ్రద్ధేదీ?

మట్టి గణపతులపై ప్రచారం కరవు



మట్టిని వదిలేసి.. మాటలు మార్చేసి

▫ చొరవ చూపని అధికార యంత్రాంగం ▫ నల్గొండ, యాదాద్రితో పోలిస్తే సూర్యాపేట భేష్

ఈనాడు, సూర్యాపేట

పర్యావరణంతో పాటు నీటి వనరులను కలుషితం చేసే రసాయన విగ్రహాలను కాకుండా.. వినాయక చవితి సందర్భంగా పర్యావరణ హిత మట్టి గణపతులనే వాడాలని కొంతకాలం సామాజిక మాధ్యమాల్లో ప్రచారం ఊపందుకుంటున్నా.. జిల్లా అధికార యంత్రాంగం ఆ దిశగా దృష్టి సారించడం లేదు. ఫలితంగా యథాప్రకారమే ఈ ఏడాదీ నల్గొండ, సూర్యాపేట, యాదాద్రి జిల్లాలో రసాయన విగ్రహాలే(ప్లాస్టర్ ఆఫ్ పారిస్ (పీవోపీ) వాడవాడలా వెలుస్తున్నాయి. సామాజిక మాధ్యమాల పుణ్యమాని ప్రజల్లోనూ కొంత మార్పులు వస్తున్నా అధికార యంత్రాంగమూ చొరవ చూపితే పర్యావరణ హిత (మిగతా 7లో)


నీటి వనరులను కలుషితం చేయొద్దు

– ధర్మనాయక్, పర్యవేక్షక ఇంజినీరు (ఎస్ఈ), నీటిపారుదల శాఖ, ఉమ్మడి నల్గొండ జిల్లా

ప్రమాదకర రసాయనాలతో తయారు చేసిన విగ్రహాలను చెరువుల్లో నిమజ్జనం చేయడం వల్ల నీటి వనరులు కలుషితం అవుతున్నాయి. ఈ ఏడాది జిల్లాలో తీవ్ర వర్షాభావ పరిస్థితులు ఏర్పడ్డాయి. ప్రస్తుతం ఉన్న నీటినే జాగ్రత్తగా వాడుకోవాల్సిన అవసరం ఉంది. ప్రజలు ఆలోచించి మట్టి వినాయకులనే ప్రతిష్ఠించుకోవాలి.

ముమ్మర ప్రచారం

నల్గొండ, యాదాద్రి జిల్లాలతో పోలిస్తే కొంతకాలం నుంచి సూర్యాపేట అధికార యంత్రాంగం మట్టి గణపతుల వాడకంపై ముమ్మరమైన ప్రచారం నిర్వహిస్తోంది. జిల్లాలోని ప్రతి మండలంలోని రెండు గ్రామ పంచాయతీలకు జిల్లా యంత్రాంగమే మట్టి గణపతులను సరఫరా చేసేలా కలెక్టరు సురేంద్రమోహన్ చర్యలు తీసుకుంటున్నారు. దీంతో యువజన సంఘాలు మట్టి గణపతుల వాడకంపై శ్రద్ధ చూపుతున్నారు.



ముచ్చటగా మూడు.. సేవలందేను చూడు

- 7లో

నిమజ్జనానికి నీరు



వినాయక నిమజ్జనానికి సూర్యాపేటలోని సద్దుల చెరువును మూసీ నీటితో నింపాలని జిల్లా పాలనాధికారి సురేంద్రమోహన్ ఆదేశించడంతో సంబంధిత అధికారులు బుధవారం ఎడమ కాల్వకు 200 కూసెక్కుల నీటిని వదిలారు. వ్యవసాయ పంటలకూ నీరు అందనుండడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. - 6లో

మీరు.. మేము.. మనమందరం



స్వచ్ఛ సూర్యాపేటలో స్థానిక ప్రజా ప్రతినిధులు భాగస్వాములు కావాలని జిల్లా పాలనాధికారి సురేంద్రమోహన్ కోరారు. బుధవారం సూర్యాపేటలో ఎంపీపీ, జడ్పీటీసీలతో స్వచ్ఛ సూర్యాపేట-స్వచ్ఛ తెలంగాణ పథకంలో భాగంగా మరుగుదొడ్ల ప్రాధాన్యంపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. - 3లో



సర్వేనెంబరు 93లోని 16.21 ఎకరాల్లో సాగవుతున్న పత్తి పంట

తెరముందు యంత్రాంగం.. తెరవెనుక మంత్రాంగం

● అన్యాక్రాంతమవుతున్న 16.21 ఎకరాల భూమి

● నల్గొండ మండలం గుండ్లపల్లిలో ఆక్రమణ ● 'ఈనాడు' పరిశోధనలో వెల్లడి

ఈనాడు – నల్గొండ

దాదాపు రూ.ఐదు కోట్ల నుంచి రూ.ఆరు కోట్ల విలువచేసే ప్రభుత్వ భూమి అది. నల్గొండ జిల్లా కేంద్రానికి కేవలం ఐదు కి.మీ. దూరంలో గుండ్లపల్లి గ్రామ రెవెన్యూ పరిధిలోని 16.21 ఎకరాల భూమిని కొంత మంది 'పెద్దల' సహకారంతో కొన్నేళ్లుగా కొందరు పక్క గ్రామం రైతులు యథేచ్ఛగా ఆక్రమించుకొని సాగు చేసుకుంటున్నారు. ప్రభుత్వ భూమి అన్యాక్రాంతమైనా సదరు రెవెన్యూ అధికారులు పట్టనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలున్నాయి.

అసలు ఏం జరిగిందంటే...

నల్గొండ మండలం గుండ్లపల్లి గ్రామ రెవెన్యూ పరిధిలో సర్వే నెంబరు 93లో 16.21 ఎకరాల భూమి ఉంది. దీనిని 'పీర్లమాన్యం' పేరుతో ఆ గ్రామంలోని ఓ ముస్లిం కుటుంబానికి అప్పట్లో ఇనాంగా ఇచ్చారు. కాలక్రమేణా ఆ కుటుంబం వివిధ ప్రాంతాల్లో స్థిరపడటంతో కొంతకాలంగా ఆ భూమి పడావుగా ఉంది. రెవెన్యూ గెజిట్లో సరైన దస్త్రాలు లేకపోవడం, ఆ భూమికి సంబంధించిన వారు స్పందించకపోవడంతో దానిని కొంతకాలంగా ప్రభుత్వ భూమిగానే పరిగణిస్తున్నారు. రెండేళ్ల నుంచి ఈ భూమిపై కన్నేసిన కొందరు నేతలు తెరవెనక మంత్రాంగం నడిపి ఏటా కొంత భూమిని ఆక్రమించి వాటిలో పంటలను సాగు చేస్తున్నారు. గతేడాది పదెకరాల భూమిలో పంటలు సాగుచేయగా... ఇప్పుడు మొత్తం 16 ఎకరాలలో పత్తి పంట వేశారు. ఈ విషయమై రెండేళ్ల నుంచి స్థానిక (మిగతా 7లో)

భూమిని స్వాధీనం చేసుకోవాలి

– శ్రవన్, గ్రామస్థుడు, గుండ్లపల్లి



రెవెన్యూ అధికారులు తక్షణం ఈ భూమిని స్వాధీనం చేసుకోవాలి. గతంలోనూ మేం ఈ భూమి కబ్జాకు గురైందని స్థానిక అధికారులకు చెప్పాం. పూర్తి స్థాయి సర్వే జరిపి ప్రభుత్వ భూమిని కాపాడాలి.

వరంగల్‌లో సెప్టెంబర్ 10న రజక వధూవరుల వివాహ పరిచయ వేదిక

రజక కమ్యూనిటీలో సంబంధాలను అన్వేషించే వారి సౌకర్యార్థం ఈనాడుపెళ్లిపందిరి.నెట్ వరంగల్‌లో సెప్టెంబర్ 10న పరిచయవేదిక నిర్వహిస్తుంది.

వేదిక: హోటల్ వైష్ణవి గ్రాండ్, ఫాతిమా కాంప్లెక్స్, ఫాతిమానగర్, ఖాజీపేట్, వరంగల్.

ప్రత్యేకతలివీ.. వధువు/వరుడు, వారి ఇష్టాఇష్టాల పరిచయం.

వధువు/వరుడు వివరాలతో కూడిన సి.డి. ఇవ్వబడును. ఈనాడుపెళ్లిపందిరి.నెట్ వెబ్‌సైట్ ద్వారా మీకు నచ్చిన 10 'కాంటాక్ట్ నంబర్స్' 30 రోజుల కాల వ్యవధిలో పూర్తి ఉచితంగా చూసుకునే అవకాశం. ఈనాడుపెళ్లిపందిరి.నెట్ ద్వారా వివాహం జరిగిన వారు 3 నెలల లోపు తెలియచేస్తే రూ॥ 2500/- విలువ గల గిఫ్ట్ కూపన్ అందచేయబడును.

పరిచయవేదికకు వచ్చిన వధువు/వరుడుతో కలిపి ముగ్గురు వ్యక్తులకు భోజన వసతి. రిజిస్ట్రేషన్ల సంఖ్య పరిమితం. రుసుము రూ॥ 2100/-. రిజిస్ట్రేషన్ కొరకు వచ్చునపుడు వధువు/వరుడుల ఐ.డి.ప్రూఫ్ (ఆధార్ కార్డ్/పాస్‌పోర్ట్/డ్రైవింగ్ లైసెన్స్/ఓటర్ కార్డ్) తీసుకురావాలి. ముందుగా రిజిస్ట్రేషన్ చేసుకొనేవారికి 10% తగ్గింపు కలదు. 10% తగ్గింపు పొందుటకు ఆఖరు తేది : 31-08-2017.

మరిన్ని వివరాలకు సంప్రదించండి : ఈనాడు ఆఫీస్, ఇంటి నెం. 1-8-205, బాలసముద్రం స్విమ్మింగ్ పూల్ దగ్గర, హన్మకొండ, వరంగల్. ఫోన్స్ : 8008550132, కరీంనగర్ : 8008551132, నిజామాబాద్ : 8008551131, ఖమ్మం : 8008550131, మహబూబ్‌నగర్ : 8008551130, సూర్యాపేట్ : 9177147543, హైదరాబాద్ : 9100058123.

వరుడు లేదా వధువులకు సంబంధించిన కార్డ్ సైజ్ ఫోటో తప్పక వెంట తీసుకురావాలి. నిరంతరం ప్రత్యక్ష సేవలు మరియు సమాచారం కోరువారికి నిర్ణీత రుసుముతో ప్యాకేజిలు కూడా లభ్యమవుతాయి.

రిజిస్ట్రేషన్స్ ఆన్‌లైన్‌లో కూడా చేసుకోవచ్చు.
www.eenadupellipandiri.net

నీరు కదలదు.. ఆయకట్టు తడవదు



ఇప్పలగూడెం వద్ద ముళ్లచెట్లతో నిండిన పిల్లకాలువ

అధ్వానంగా ఏఎమ్మార్పీ కాలువలు

కేతేపల్లి, న్యూస్‌టుడే:

పద్దెనిమిది వేల ఎకరాల భూములకు సాగు నీరందించాల్సిన ఏఎమ్మార్పీ డీ-49 ప్రధాన కాలువ అధ్వానంగా తయారైంది. పన్నెండు గ్రామాలలోని బీడు భూములకు కృష్ణా జలాలను అందించాల్సిన ప్రధాన కాలువ నిండా కంపచెట్లు, పిచ్చి మొక్కలు పెరిగి ఆనవాళ్లు కోల్పోయింది. ప్రధాన కాలువ పరిస్థితే ఇలా ఉంటే ఇక మైనర్లు, పిల్లకాలువల గురించి చెప్పే పరిస్థితి లేదు. రైతుల అవసరాల కోసం కృష్ణా జలాలను విడుదల చేస్తే నీరు అడుగు ముందుకు వెళ్లే అవకాశం లేదు. కనీసం ఆయకట్టు గ్రామాల్లోని చెరువులు, కుంటలకు కూడా నీరు చేరని దుస్థితి నెలకొంది. కాలువలు తవ్విన పదిహేనేళ్ల నుంచి ఇందులో కంపచెట్లు తొలగించిన దాఖలాలు లేవు. దీంతో ఏఎమ్మార్పీ కాలువలు రూపురేఖలు కోల్పోయాయి. కాలువల నిర్వహణకు ప్రత్యేక సిబ్బంది లేకపోవడంతో దీని గురించి పట్టించుకునే వారు కరవయ్యారు. కాలువలు అధ్వానంగా ఉండటంతో నీరొచ్చిన సమయంలో ఎగువ ప్రాంతం వరకే పరిమితమవుతున్నాయి.

షట్టర్లు లేని తూములు

ఏఎమ్మార్పీ డీ-49 కాలువకు అనుబంధంగా ఉన్న మైనర్, సబ్‌మైనర్ కాలువల తూములకు షట్టర్లు లేవు. దీంతో నీరు వచ్చిన సమయంలో ఎగువ ప్రాంతాలలోని తూములకే వచ్చిన నీరంతా వెళ్తోంది. ఎగువ రైతులు దిగువకు నీరు వెళ్లకుండా రాళ్లు అడ్డం పెడుతున్నారు. దీంతో వచ్చిన నీరంతా పైతూముల ద్వారానే వెళ్తోంది. ఫలితంగా నీరు వచ్చిన సమయంలో బండెపాలెం, కొండకిందిగూడెం, చెరుకుపల్లి, ఎల్లమ్మగూడెం, మండలాపురం గ్రామాలకు నీరురావడం ఇబ్బందికరంగా తయారైంది. షట్టర్లు బిగించాలని అధికారులకు ఎన్నిమార్లు మొరపెట్టుకున్నా ప్రయోజనం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కనుమరుగవుతున్న పిల్ల కాలువలు

ఎలిమినేటి మాధవరెడ్డి ప్రాజెక్టుకు అనుబంధంగా నిర్మించిన పిల్ల కాలువలు కనుమరుగవుతున్నాయి. సంవత్సరాల తరబడి నీరు రాకపోవడంతో పరిసర రైతులు కాలువలను దున్నుకుంటున్నారు. కొన్నిచోట్ల భారీ వర్షాలకు కాలువ కట్టలమట్టి కారిపోయి అవి ఆనవాళ్లు కోల్పోతున్నాయి. మండలంలోని ఇప్పలగూడెం, కొండకిందిగూడెం, బండెపాలెం, ఉప్పలపహాడ్ శివారు ప్రాంతాలలో దాదాపు ఎనిమిది మైనర్ కాలువలు ఇప్పటికే కనుమరుగైపోయాయి. పరిస్థితి ఇలాగే ఉంటే భవిష్యత్‌లో మైనర్, సబ్‌మైనర్ కాలువలు కనిపించే పరిస్థితి ఉండదు.



కొండకిందిగూడెం శివారులో షట్టరులేని డిస్ట్రిబ్యూటర్

లైనింగ్ చేస్తే ప్రయోజనం:

బొజ్జ చినవెంకులు, వ్యవసాయ సంఘం అధ్యక్షుడు



ఏఎమ్మార్పీ కాలువలకు లైనింగ్ నిర్మించాలి. లైనింగ్ చేయడంవల్ల కంపచెట్లు పెరగకపోవడంతోపాటు పూడిక చేరే పరిస్థితి ఉండదు. దీంతో నీరు వదిలిన సమయంలో చివరివరకు సాఫీగా వెళుతుంది. లైనింగ్ చేసేందుకు అవసరమైన ప్రతిపాదనలు రూపొందించి అవసరమైన నిధులతో పనులు చేపట్టాలి.

రెండుసార్లు మాత్రమే నీళ్లు వచ్చాయి:

పెద్దినాగయ్య, రైతు, గుడివాడ



పదిహేనేళ్ల క్రితం కాలువలను తవ్వారు. ఇప్పటి వరకు కేవలం రెండుసార్లు మాత్రమే నీళ్లు వచ్చాయి. నాగార్జునసాగర్ ప్రాజెక్టు నిండిన ప్రతి సంవత్సరం నీరు విడుదల చేస్తున్నప్పటికీ అవి మొదటి ప్రాంతం వారికే పరిమితమవుతున్నాయి. దిగువకు రావడం లేదు. కాలువలనిండా ముళ్లచెట్లు, పిచ్చిమొక్కలు పెరగడంతో నీరు వచ్చే పరిస్థితి లేదు.

గుట్కా ప్యాకెట్లు స్వాధీనం

కోదాడ పట్టణం, న్యూస్‌టుడే: కోదాడ పట్టణంలోని తక్ధీర్ టీ సెంటర్ సమీపంలో ఉన్న పాన్‌షాపులో గుట్కాలు విక్రయిస్తున్నారనే సమాచారం తెలుసుకుని బుధవారం దుకాణంపై పోలీసులు దాడులు చేశారు. దాడిలో 1389 గుట్కా ప్యాకెట్లను పోలీసులు స్వాధీనం చేసుకుని, దుకాణ యాజమాని కె. సైదయ్యపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై మహిపాల్‌రెడ్డి తెలిపారు.

బ్యాంకు అధికారులమంటూ ఏటీఎం పిన్ నంబరు తెలుసుకొని..

అడవిదేవులపల్లి, న్యూస్‌టుడే: బ్యాంకు ఉన్నతాధికారులమంటూ ఏటీఎం పిన్ నంబరు తెలుసుకొని ఖాతాలో ఉన్న నగదును డ్రా చేసుకున్నారు సైబర్ నేరగాళ్లు... బాధితురాలైన మండలంలోని ముదిమాణిక్యంకు చెందిన శాంతిరాయ్ తెలిపిన వివరాల ప్రకారం... కలకత్తాకు చెందిన అకుల్‌రాయ్, శాంతిరాయ్ గత కొన్నాళ్లుగా ముదిమాణిక్యంలో నివాసముంటూ సమీపంలో గల కృష్ణానదిలో చేపలు పట్టుకుంటూ జీవనం కొనసాగిస్తున్నారు. శాంతిరాయ్‌కు మిర్యాలగూడలోని యాక్సిస్‌బ్యాంకులో పొదుపు ఖాతా ఉంది. మంగళవారం ఆమెకు ఓ ఫోన్‌కాల్ వచ్చింది. తాను బ్యాంకు అధికారినని మీ ఏటీఎం గడువు పూర్తయిందని రెన్యూవల్ చేసేందుకు సీక్రెట్ నంబరు కావాలని అడుగగా ఆమె వారికి తెలియపరిచింది. కొద్దిసేపటి తరువాత వారి ఖాతా నుంచి రూ. 9,900, రూ. 2,998, 2,000, 2,800 చొప్పున నాలుగు విడతలుగా ఖాతాలో ఉన్న సుమారు రూ. 25వేలను సైబర్ నేరగాళ్లు డ్రా చేశారు. నగదు ఉపసంహరణ జరిగినట్లు సమాచారం రావడంతో బాధితురాలు బుధవారం బ్యాంకు అధికారులను సంప్రదించారు. వారి సూచన మేరకు అడవిదేవులపల్లి ఠాణాలో ఫిర్యాదు చేశారు. తన సెల్‌కు వచ్చిన నంబరును ఫిర్యాదులో పేర్కొన్నట్లు బాధితురాలు తెలిపారు.

గిరిజన తండా రాదారులకు మహర్దశ

☛ 19 రోడ్లకు రూ.21 కోట్లు మంజూరు



అభివృద్ధికి నోచుకోనున్న కేసారం ఆవాస ప్రాంతం రూప్లాతండా రోడ్డు

సూర్యాపేట గ్రామీణం, న్యూస్‌టుడే: పల్లె ప్రగతికి పక్కా రహదారులు దోహదపడతాయి. రాకపోకలు సక్రమంగా ఉన్న గ్రామాలకు వైద్య, విద్య ఇతర సౌకర్యాలు అందుబాటులో ఉంటాయి. ఎన్నో సంవత్సరాలుగా రోడ్లు లేక ఇబ్బందులు పడుతున్న గిరిజన తండాలకు మోక్షం లభించనుంది. గుంతలతో అస్తవ్యస్తంగా మారిన రోడ్లకు మహర్దశ పట్టనుంది. 200 జనాభాకు పైబడిన గిరిజన తండాలకు బీటీ రోడ్లు నిర్మాణం కోసం రాష్ట్ర ప్రభుత్వం నిధులు కేటాయించింది. గిరిజన ఉప ప్రణాళిక నిధుల నుంచి సూర్యాపేట జిల్లాలోని 19 బీటీ రోడ్ల నిర్మాణానికి రూ. 21 కోట్లు మంజూరు చేసింది. గిరిజన సంక్షేమ శాఖ నిధులైనప్పటికీ సిబ్బంది కొరత నేపథ్యంలో పంచాయతీరాజ్ శాఖ అధికారుల పనులను పర్యవేక్షించనున్నారు.

నిధులు మంజూరయ్యాయి:

–సంఘమేశ్వరరావు, పంచాయతీరాజ్ ఈఈ

తెలంగాణ ప్రభుత్వం జిల్లాలో 19 గిరిజన తండాల రోడ్లకు ఎస్టీ ఉపప్రణాళిక నిధుల కింద రూ. 21 కోట్లు మంజూరు చేసింది. టెండర్లు పిలిచిన తర్వాత పనులు చేపడతాం. పనులను పంచాయతీరాజ్ శాఖ పర్యవేక్షిస్తుంది.

బీటీ రోడ్లకు నిధుల కేటాయింపు ఇలా..

రహదారి	నిధులు (రూ. లక్షల్లో...)
చివ్వెంల- రాజుతండా, పాండ్యానాయక్ తండా	200
చివ్వెంల, ముకుందాపురం, పీడబ్ల్యూరోడ్డు- పొలిమేర సూర్యాతండా వయా బద్యాతండా, పాచ్చాతండా	220
వట్టిఖమ్మంపహాడ్- జగన్‌తండా మీదుగా మంగళితండా	310
కేసారం జడ్పీరోడ్డు- బనావత్‌తండా (రూప్లాతండా), తాళ్లఖమ్మంపహాడ్‌రోడ్డు	190
తుంగతుర్తి మండలంలోని బండరామారం- మంచ్యాతండా వయా సూర్యాతండా	176
జలాల్‌పురం- రాజునాయక్‌తండా	174
తుంగతుర్తి-మానాపురం పీడబ్ల్యూరోడ్డు నుంచి దేవునిగుట్టతండా	44
పీడబ్ల్యూడీరోడ్డు- పిచ్చిరెడ్డితండా	44
పీడబ్ల్యూడీరోడ్డు- చింతకుంటతండా	45.50
గుండెపూరి నుంచి కేఆర్‌కేతండా వరకు	84
హుజూర్‌నగర్ ఆర్‌అండ్‌బీ రోడ్డు-అవిరేనికుంటతండా	60
గుండ్లపహాడ్ ఆర్‌అండ్‌బీ రోడ్డు- దేవులాకుంట తండా	50
ఆర్‌అండ్‌బీ రోడ్డు-కొత్తగూడెం తండా	20
పీఆర్‌రోడ్డు- శివబాలాజీనగర్‌తండా	40
ఆర్‌అండ్‌బీ రోడ్డు-గాంధీనగర్‌తండా	45
కొత్తగూడెం-కపూరియాతండా	40
జడ్పీరోడ్డు-సీత్లాతండా	75
పీడబ్ల్యూరోడ్డు-బొజ్జగూడెంతండా	150
మోతె మండలం జడ్పీరోడ్డు-బీక్యాతండా	150

పోలీసుల అదుపులో నిందితులు..!

నల్గొండ నేరవిభాగం, న్యూస్‌టుడే: కనగల్ మండలం కురంపల్లికి చెందిన ఇద్దరు సోదరులు దాసరి అన్నమయ్య, ఆంజనేయులు జంట హత్య కేసులో ముగ్గురు ప్రధాన నిందింతులు పోలీసుల అదుపులో ఉన్నట్లు సమాచారం. వీరితో పాటు మరో నలుగురికి ఈ కేసుతో సంబంధం ఉన్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. మిగిలిన వారి ఆచూకీతో పాటు హత్యకు దారితీసిన ఘటనపై అదుపులో ఉన్నవారిని విచారణ చేస్తున్నట్లు తెలుస్తోంది.

గ్రామీణుల చెంతకు పశువైద్య సేవలు

తమ్మర(కోదాడ రూరల్), న్యూస్‌టుడే: గ్రామీణుల చెంతకు ఆధునిక పశువైద్య సేవలను ప్రత్యేక శిబిరాల ద్వారా చేరువ చేస్తున్నట్లు పీవీ నర్సింహారావు పశువైద్యకళాశాల ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ ప్రొఫెసర్ డాక్టర్ రాజన్న అన్నారు. బుధవారం కోదాడ మండలం తమ్మరలో ప్రత్యేక పశువైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనతోపాటు జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి డాక్టర్ నర్సింహారెడ్డి మాట్లాడారు. గతేడాది మహబూబ్‌నగర్ జిల్లాలో శిబిరాలు నిర్వహించగా, ఈ ఏడాది సూర్యాపేట జిల్లాలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఏడు రోజులపాటు కోదాడ నియోజకవర్గంలోని 30 గ్రామాల్లో శిబిరాలను నిర్వహించి 75మంది శిక్షణ డాక్టర్లు, 25 మంది ప్రొఫెసర్లతో వైద్యసేవలు, పరీక్షలు, మందుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 9రకాల వైద్య పరీక్షలను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏడీఏ డాక్టర్ అనిల్‌కుమార్, పశువైద్యాధికారులు డాక్టర్ పి. పెంటయ్య, సర్పంచి కాటయ్య, వైద్యులు నాగరాజు, గోపాలక్రిష్ణ, శ్రీనాథ్, తదితరులు పాల్గొన్నారు.

చికెన్ ధరలు

	వెన్‌కాబ్	సుగుణ
ఫాంరేటు	82–00	84–00
రిటైల్	97–00	99–00
డ్రెస్డ్	136–00	144–00
స్కిన్‌లెస్	160–00	168–00

బోనాల పండగ... ముత్యాలమ్మ బోనాలు.. వినాయకచవితి... దసరా, దీపావళి, పండుగలు.. స్వాముల దీక్షలు ప్రారంభానికి ముందుగానే పెద్దఎత్తున ఎలాంటి బిల్లులు లేకుండానే ఆంధ్ర ప్రాంతం నుంచి దేవుడి నూనె బాటిళ్లు సరిహద్దులు దాటించేస్తున్నారు. దేవుడి నూనెలు కదా అని ఎవరు పట్టించుకోని తీరుతో... వ్యాపారులు ఎలాంటి బిల్లులు లేకుండా రాష్ట్ర జిల్లా సరిహద్దులు దాటించి దర్జాగా విక్రయాలు సాగిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. నాసి రకం నూనెలు దేవుడి దీపారాధనకు వినియోగించాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి.

మిర్యాలగూడ, న్యూస్‌టుడే:



మిర్యాలగూడలో జోరుగా బిల్లులు లేకుండా విక్రయాలు

పొరుగు రాష్ట్రం నుంచి పోటెత్తిన నూనె

హద్దులు దాటిన అవినీతి

దేవుడి దీపాల కోసం నాసిరకం నూనెలు

పండగల సీజన్ వచ్చిందంటే చాలు దీపాలు వెలిగించేందుకు గాను ఇళ్లలో ఆలయాల్లోకి నూనెలను విరివిగా ప్రజలు కొనుగోలు చేస్తుంటారు. దీన్ని అదునుగా తీసుకుని గుంటూరు జిల్లాలోని పలువురు వ్యాపారులు రంగురంగుల బాటిళ్లలో నూనెలను నింపి వంద గ్రాములు, పావుకిలో, అర కిలో, ముప్పావు కిలో, కిలో బాటిళ్లకు లేబుళ్లు వేసి నేరుగా జిల్లాకు తరలిస్తున్నారు. గతంలో దామరచర్ల మండలం వాడపల్లి వద్ద సరిహద్దు తనిఖీ కేంద్రం వద్ద తనిఖీలు చేస్తున్నప్పటికీ స్థానికంగా విధుల్లో ఉన్న సిబ్బందిని మేనేజ్ చేసి తీసుకువచ్చేవారు.. జీఎస్టీ అమలుతో సరిహద్దుల్లోని వాణిజ్య పన్నుల చెక్ పోస్టులు తీసివేయటంతో చీకటి దందా వ్యాపారుల రాజ్యం సాగుతోంది. నెలకు సుమారుగా రూ.4 కోట్ల వరకు దేవుడి నూనెలను గుంటూరు జిల్లాకు చెందిన ఓవ్యాపారి జిల్లాకు తరలిస్తున్నట్లు సమచారం. కనీసం బిల్లులు లేకుండా వందల సంఖ్యలో సీసాలు, కార్టన్లతో మిర్యాలగూడలోని కిరాణదుకాణాలకు తరలిస్తున్నారు. దుకాణాల వారు సైతం బిల్లులు లేకుండా వస్తుండగా ఆసక్తిగా కొనుగోలు చేస్తున్నారు. పట్టణంలోని పాతబస్టాండు, గణేష్‌మార్కెట్, కుండల బజారు, సీతారాంపురం ప్రాంతాల్లోని కిరాణ దుకాణాల్లో బిల్లులు లేని నూనెల అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి.

❖ దేవుడి నూనెలు అనే సరికి పోలీసులు , ఇతర శాఖల అధికారులు కూడా చూసిచూడనట్లు వదిలివేస్తుండగా వారి ఇష్టారాజ్యం సాగుతుంది. వ్యాపారులు నేరుగా ట్రాలీ ఆటో, డీసీఎంలో మిర్యాలగూడకు తీసుకువచ్చి స్థానికంగా సీతారాంపురంలో నిలిపి ఉంచి పట్టపగలే ఎలాంటి బిల్లులు లేకుండా నూనెలను కిరాణ దుకాణాలకు తరలిస్తున్నారు.

❖ దేవుడి నూనెల నాణ్యత పరిశీలించేందుకు ఎవరు ఇప్పటివరకు చర్యలు తీసుకోక పోతుండగా పూర్తిగా నాసిరకం కల్తీ నూనెలు, ఎముకల నూనెలను సైతం వ్యాపారులు కలుపుతున్నారనే ఆరోపణలు వినవస్తున్నాయి.

❖ నూనె కల్తీ అనగానే మిల్లుల వైపు మాత్రమే తనిఖీలు చేస్తున్న పోలీసు, విజిలెన్స్ అధికారులు కిరాణ దుకాణాలు, పూజసామాగ్రి విక్రయించే వ్యాపారుల దుకాణాలు తనిఖీలు చేయకపోతుండగా వీరు బిల్లులు లేకుండా నాసిరకం నూనెలను నేరుగా వినియోగదారులకు అంటగడుతున్నారు. కాలనీల్లోని చిరువ్యాపారుల వద్ద తనిఖీలు చేయక పోవటం వీరి ఇష్టారాజ్యం సాగుతోంది. ఇకనైనా సంబంధిత విజిలెన్స్, వాణిజ్య పన్నుల శాఖల అధికారులు తనిఖీలు చేసి బిల్లులు లేకుండా విక్రయించే దేవుడి నూనెల అక్రమాలను అంతుచూడాలని ప్రజలు కోరుతున్నారు.

తనిఖీలు చేసి చర్యలు..

మస్తాన్‌వలీ, సీటీవో

బిల్లులు లేకుండా ఇతర ప్రాంతాల నుంచి నూనె సీసాలు వచ్చిన విషయం మా దృష్టికి రాలేదు. విషయాన్ని జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతాం. దుకాణాల్లో తనిఖీలు చేసి బిల్లులు లేకపోతే చర్యలు తీసుకుంటాం. బిల్లులు లేకుండా సామగ్రి తీసుకు వస్తే కఠిన చర్యలు తీసుకుంటాం.

దేవాలయ భూమిని పరిశీలించిన తహసీల్దార్

● 'ఈనాడు' కథనానికి స్పందన

పంతంగి(చౌటుప్పల్‌గ్రామీణం),న్యూస్‌టుడే: పంతంగి గ్రామంలో జాతీయ రహదారి పక్కనే రూ.కోట్లు విలువ చేసే దేవాలయ భూమి అన్యాక్రాంతమవుతుందని బుధవారం ఈనాడు జిల్లా సంచికలో 'భూమికి లేదు హామి' అనే శీర్షికన ప్రచురితమైన కథనానికి తహసీల్దార్ షేక్ అహ్మద్ స్పందించారు. దేవాలయ భూమిని పంతంగి, లింగోజిగూడెం వీఆర్వోలు పద్మనాభం, సత్యనారాయణరెడ్డితో కలిసి పరిశీలించారు. దేవాలయ భూమికి సంబంధించిన వివరాలను వారిని అడిగి తెలుసుకున్నారు. పాత రికార్డులను, నకల్లను పరిశీలించారు. 80 సంవత్సరాలుగా ఈ భూమి దేవాలయ అధీనంలో ఉందని, రెవెన్యూ రికార్డులో సీతారామచంద్రస్వామి దేవాలయం పేరు వస్తుందని సర్పంచి అంతటి రమేష్‌గౌడ్, మాజీ ఎంపీటీసీ సభ్యుడు దూడల భిక్షంగౌడ్, పలువురు తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లారు. గతంలో దేవాలయం పేరు మీద భూమిని కౌలుకు ఇచ్చినట్టు గుర్తుచేశారు. ఇప్పుడు పంతంగిలోని సర్వే నంబర్లు 550, 553లు ఓవర్ ల్యాప్ అయ్యాయని చెప్పి దేవాలయ భూమిని ప్రైవేట్ వ్యక్తులకు ఎలా అనుకూలంగా సర్వే రిపోర్టు ఇస్తారని ప్రశ్నించారు. దేవాలయ భూమికి చుట్టు కంచె వేయించాలని కోరారు. తహసీల్దార్ స్పందిస్తూ అది సర్వే, ల్యాండ్ రికార్డులు వారు ఇచ్చిన రిపోర్టు మాత్రమేనని తెలిపారు. ఇప్పటికి రెవెన్యూ రికార్డులో దేవాలయం పేరు మీదనే భూమి ఉన్నట్టు గ్రామస్థులకు చెప్పారు. అవసరమైతే మరోసారి సర్వే చేయిస్తామని, దేవాలయ భూమిని ఇతరులకు పట్టా చేయమని స్పష్టం చేశారు.



పంతంగిలో విచారణ చేపడుతున్న తహసీల్దార్ షేక్ అహ్మద్

నేడు అంబేడ్కర్ యూనివర్సిటీలో ప్రవేశాలకు ఆఖరు తేది

నల్గొండ విద్యావిభాగం, న్యూస్‌టుడే: డా.బి.ఆర్.అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ ద్వారా డిగ్రీ, పీజీలో ప్రవేశాలకు గురువారం ఆఖరు తేదీ అని ఆ యూనివర్సిటీ ఉమ్మడి నల్గొండ జిల్లా రీజనల్ కోఆర్డినేటర్ బి.ధర్మానాయక్ తెలిపారు. జిల్లాలోని 13 అధ్యయన కేంద్రాలలో ఆన్‌లైన్ ద్వారా ఫీజు చెల్లించి ప్రవేశాలు పొందవచ్చని చెప్పారు. ఎలాంటి విద్యార్హత లేని వారు, అర్హత పరీక్షలో అర్హత సాధించినవారు, ఇంటర్, ఓపెన్ ఇంటర్, పాలిటెక్నిక్, ఐటీఐ ఉత్తీర్ణులైన వారు ప్రవేశాలు పొందవచ్చని తెలిపారు. ఎంబీఏలో చేరేందుకు ఐసెట్‌లో అర్హత సాధించి ఉండాలన్నారు. ఉమ్మడి నల్గొండ జిల్లాలోని మీ సేవా కేంద్రాల ద్వారా ఫీజు చెల్లించి ప్రవేశాలు పొందాలని సూచించారు.

బహిరంగ మల విసర్జన రహిత జిల్లాగా మార్చాలి: కలెక్టర్

సూర్యాపేట కలెక్టరేట్, న్యూస్‌టుడే: స్వచ్ఛ సూర్యాపేటలో ప్రజా ప్రతినిధులు భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్ కె.సురేంద్రమోహన్ కోరారు. 'స్వచ్ఛ సూర్యాపేట-స్వచ్ఛ తెలంగాణలో భాగంగా మరుగుదొడ్ల ప్రాధాన్యంపై బుధవారం జిల్లా కలెక్టరేట్‌లో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ కార్యక్రమం ఏర్పాటుచేశారు. ఈ ప్రత్యేక సమావేశానికి హాజరైన ఎంపీపీ, జడ్పీటీసీ సభ్యులనుద్దేశించి కలెక్టర్ మాట్లాడారు. జిల్లాలో 2,08,381 గ్రామీణ కుటుంబాలకు గాను 1,40,699 కుటుంబాలకు మాత్రమే వ్యక్తిగత మరుగుదొడ్లు ఉన్నట్లు ఇటీవల నిర్వహించిన స్వచ్ఛభారత్ సర్వేలో వెల్లడైందని తెలిపారు. అక్టోబర్ 2 నాటికల్లా సూర్యాపేటను బహిరంగ మల విసర్జన రహిత ఓడీఎఫ్ జిల్లాగా మార్చేందుకు ఇంకా 67,682 కుటుంబాలకు మరుగుదొడ్లు నిర్మించి ఇవ్వాలని సూచించారు. ఈ లక్ష్యాన్ని సాధించేందుకు ముందస్తుగా కనీసం 20 వేలు మరుగుదొడ్లు నిర్మించాలనే లక్ష్యాన్ని నిర్దేశించుకున్నట్లు చెప్పారు. బహిరంగ మల విసర్జన ద్వారా వచ్చే ఇబ్బందులను ప్రజలతో బహిరంగంగా చర్చించినప్పుడే వారి అలవాట్లలో మార్పు వస్తుందని పేర్కొన్నారు. ఒక గ్రాము మానవ మలములో కోట్లాది వ్యాధికారక క్రిములు ఉంటాయని, పశువులు, కోళ్లు, కుక్కలు, ఈగల ద్వారా ఈ క్రిములు ఇళ్లలోకి చేరుతాయన్నారు. కలషిత నీరు, పారిశుద్ధ్య లోపంతో 80 శాతం అంటు రోగాలు, జ్వరాలు వస్తాయని, అపరిశుభ్రతతోనే శిశు మరణాలు ఎక్కువగా సంభవిస్తున్నట్లు తెలిపారు. ఆడ పిల్లలకు వివాహం చేసేవారు మరుగుదొడ్డి లేని ఇళ్లకు తమ కూతురిని ఇవ్వమనే భావం కలగాలని కోరారు. ప్రతి మరుగుదొడ్డి నిర్మాణానికి ప్రభుత్వం రూ. 12 వేలు ఇస్తుందని, పంచాయతీ సర్పంచి, కార్యదర్శి సంయుక్త ఖాతాకు ముందుస్తుగా నిధులు మంజూరు చేస్తున్నట్లు చెప్పారు. పని ప్రారంభించిన వెంటనే రూ. 6 వేలు లబ్ధిదారునికి జమ చేస్తున్నట్లు వివరించారు. ఓడీఎఫ్‌గా మారిన గ్రామాలకు ప్రత్యేక నిధులు కేటాయించనున్నట్లు తెలిపారు. ప్రధాన మంత్రి మన్‌కీ బాత్‌లో సూర్యాపేటకు చోటు దక్కాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో డీఆర్వో పి.యాదిరెడ్డి, డీఆర్డీవో ఎస్.కిరణ్‌కుమార్, డీఏవో జ్యోతిర్మయి తదితర అధికారులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఆవరణలో రైతులకు బిందు, తుంపర సేద్యం యూనిట్లను అందిస్తున్న కలెక్టర్ కె.సురేంద్రమోహన్

27న జానపద జాతర

సూర్యాపేట కలెక్టరేట్, న్యూస్‌టుడే: ప్రపంచ జానపద దినోత్సవం సందర్భంగా ఈ నెల 27న సూర్యాపేట పబ్లిక్ క్లబ్‌లో నిర్వహించే జానపద జాతరను విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ కె.సురేంద్రమోహన్ బుధవారం ఒక ప్రకటనలో కోరారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర విద్యుత్తు, ఎస్సీ అభివృద్ధి శాఖ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొంటారని తెలిపారు. సాయంత్రం 4 గంటలకు సూర్యాపేట పట్టణంలోని కొత్త బస్టాండ్ సమీపంలో ఉన్న తెలంగాణ తల్లి విగ్రహం నుంచి జానపద కళాకారుల ర్యాలీ నిర్వహించేందుకు జిల్లా జానపద కళాకారుల సంఘం ముందుకు వచ్చినట్లు తెలిపారు. సాయంత్రం 6 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు కళాకారులతో వివిధ కళారుపాల ప్రదర్శనలు ఉంటాయని తెలిపారు. ఈ జాతరలో పాల్గొన్న కళాబృందాలలో ఎంపిక చేసిన ఎనిమిది కళాబృందాలకు భాషా, సాంస్కృతిక శాఖ వారు నగదు బహుమతి అందజేస్తారని పేర్కొన్నారు.



ఎస్వీ ఇంజినీరింగ్ కళాశాలలో అవగాహన సదస్సులో మాట్లాడుతున్న కలెక్టర్ కె.సురేంద్రమోహన్

ఈ-మెయిల్ చేసే పరిజ్ఞానం తప్పనిసరి

భానుపురి, న్యూస్‌టుడే: ప్రతి ప్రభుత్వ ఉద్యోగికి ఈ-మెయిల్ ద్వారా సందేశం చేసే పరిజ్ఞానం తప్పనిసరిగా ఉండాలని జిల్లా పాలనాధికారి కె.సురేంద్రమోహన్ అన్నారు. బుధవారం స్థానిక ఎస్వీ ఇంజినీరింగ్ కళాశాల ఆడిటోరియంలో ఉద్యోగులకు ఈ-లెర్నింగ్‌పై ఏర్పాటుచేసిన అవగాహన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఆధునిక సాంకేతికత నైపుణ్యం పెంచినపుడే ప్రజలకు న్యాయం చేయగలుగుతామని తెలిపారు. అధికారులకు తమ శాఖాపరమైన విధులను స్వతంత్రంగా చేసుకొనే సామర్థ్యం ఉండాలని, సిబ్బందిపై ఆధారపడితే సమస్యల్లో ఇరుక్కుంటారని స్పష్టం చేశారు. అంతర్జాలాన్ని ప్రతి కార్యాలయంలో వాడుతున్నామని అధికారులకు కార్యాలయ ఉత్తర ప్రత్యుత్తరాలు, నివేదికలు పంపుట, సమాచారం పొందునికి అంతర్జాల పరిజ్ఞానం ఉండాలన్నారు. కార్యక్రమంలో ముఖ్య ప్రణాళిక అధికారి బి.సుబ్బారావు, డీఈవో వెంకటనర్సమ్మ, కళాశాల ప్రిన్సిపల్ డా.ఎ.సుజన, ఆర్డీవో మోహన్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

సూర్యాపేట కలెక్టరేట్, న్యూస్‌టుడే: ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వం రాయితీతో అందించే బిందు, తుంపర సేద్య పథకాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ కె.సురేంద్రమోహన్ అన్నారు. ఈ సందర్భంగా మఠంపల్లి, చింతలపాలెం మండలాలకు చెందిన రైతులకు ఉద్యాన శాఖ వారు మంజూరు చేసిన యూనిట్లను బుధవారం కలెక్టరేట్‌లో ఆయన చేతుల మీదుగా అందించి మాట్లాడారు. కార్యక్రమంలో ఉద్యాన శాఖ జిల్లా అధికారి శ్రీధర్, ఆయా మండలాల ఎంపీపీలు పాల్గొన్నారు.

హుజూర్‌నగర్

దరఖాస్తులు చేసుకోవాలి

హుజూర్‌నగర్, న్యూస్‌టుడే: పాత్రికేయులందరూ ఆరోగ్య కార్డులకు దరఖాస్తు చేసుకోవాలని టీయూడబ్ల్యుజే(143) రాష్ట్ర కమిటీ సభ్యులు నాయిని శ్రీనివాసరావు, పోతుగంటి వెంకటేశ్వర్లు, జిల్లా అధ్యక్షుడు వజ్జె వీరయ్య కోరారు. బుధవారం హుజూర్‌నగర్‌లో జరిగిన నియోజకవర్గ స్థాయి సమావేశంలో మాట్లాడారు. అనంతరం నియోజకవర్గ నూతన కమిటీని ఎన్నుకున్నారు. గౌరవ సలహాదారుగా ఓరుగంటి నాగేశ్వరరావు, కన్వీనర్ టి.రమేష్‌రెడ్డి, కో-కన్వీనర్లుగా మల్లయ్య, కట్టా ప్రవీణ్‌రెడ్డి, బత్తిని శోభన్‌బాబును ఎన్నుకున్నారు. క్రాంతికుమార్, ఉమ, నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గణేష్ మంటపాలకు అనుమతి తప్పనిసరి

మఠంపల్లి, న్యూస్‌టుడే: గ్రామాల్లో ఏర్పాటుచేసే గణేష్ మంటపాలకు స్థానిక ఠాణా నుంచి తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలని ఎస్సై వి. జానయ్య చెప్పారు బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. డీజేకు ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతివ్వబోమని స్పష్టం చేశారు. నిబంధనలు అతిక్రమిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నేడు విద్యుత్తు శాఖ ఏఈతో 'ఈనాడు' ఫోన్‌ఇన్

మేళ్లచెరువు, న్యూస్‌టుడే: ఉమ్మడి మేళ్లచెరువు మండలంలో ప్రజలెదుర్కొంటున్న విద్యుత్తు సమస్యల పరిష్కారం కోసం 'ఈనాడు' ఆధ్వర్యంలో ఫోన్ ఇన్ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించనున్నాం. ఆయా గ్రామాల్లో విద్యుత్తు సమస్యల పరిష్కారం కోసం ఏఈ నాగరాజుతో వినియోగదారులు మాట్లాడే అవకాశాన్ని కల్పిస్తున్నాం. ఉదయం 10 గంటల నుంచి 11 గంటల వరకు ఫోన్ చేసి సమస్యను చెప్పవచ్చు.

ఫోన్ చేయాల్సిన నంబర్లు:
94408 13615, 97018 21971

లక్ష్యం ఘనం.. ఫలితం శూన్యం

- భూసార పరీక్షలు ఇంకెంత దూరం
- నేటికీ మోతాదుకు మించి ఎరువుల వాడకం
- పెరుగుతున్న పెట్టుబడి వ్యయం


కార్యాలయంలో మూలన పడి ఉన్న భూసార పరీక్ష కిట్లు

గరిడేపల్లి, న్యూస్‌టుడే: రైతులకు భూసార పరీక్షలు అందని ద్రాక్షగా మారుతున్నాయి. అదిగో ఇదిగో అంటూ పరీక్షల ఫలితాలు దూరమవుతుండటంతో ఇచ్చిన లక్ష్యం ఘనంగా ఉంటున్నా రైతులకు ప్రయోజనం శూన్యంగా మారుతుంది. మూడేళ్ల నుంచి రైతులకు వారి భూమిలో ఉండే పోషకాల లభ్యత, లోపాలను గుర్తించి ప్రత్యేకంగా భూఆరోగ్య కార్డులందించాలన్న లక్ష్యం నేటికీ నెరవేరడం లేదు. భూమిలో ఉన్న పోషకాల లోపాలు తెలియక కొన్ని రకాలైన ఎరువులను అన్నదాతలు మోతాదుకు మించి వాడుతున్నారు. దీంతో పెట్టుబడి వ్యయం భారంగా మారుతుంది.

సారం తగ్గుతున్నా..

సాగర్ ఆయకట్టులో సాగునీటి వినియోగం అధికంగా ఉండటంతో పాటు రసాయనిక ఎరువులు విచ్చలవిడిగా వాడటంతో భూములు నిస్సారంగా మారుతున్నాయి. సేంద్రియ ఎరువులు, పశువుల ఎరువు లేకపోవడంతో భూమిలోని సారం పెరుగుదలకు అవకాశం లేకుండా పోయింది. రైతులు పంట దిగుబడి లక్ష్యంగా ఎరువులు వినియోగిస్తున్నారు. భాస్వరం అధికంగా ఉన్నట్లు భూసార పరీక్షలలో తేలినా అది రైతులకు పూర్తిస్థాయిలో అవగాహన లేక భాస్వరం ఉన్న ఎరువులనే వేసుకుంటున్నారు. తద్వారా భూమి సారం కోల్పోవడంతో పాటు ఇతర సూక్ష్మపోషకాలపై ప్రభావం చూపుతుంది.

పరీక్షలు జాప్యం

వ్యవసాయ శాఖ క్షేత్రస్థాయిలో సిబ్బందికి లక్ష్యం నిర్దేశించి చేతులు దులుపుకొంటోంది. వారికి ఆ సమయంలో ఇతర పనులు లేకుంటే వెంటనే మట్టి నమూనాలు సేకరించి ప్రయోగశాలకు పంపవచ్చు. లక్ష్యం నిర్దేశిస్తూనే మరో పని అప్పగిస్తున్నారు. దీంతో రెండు పనులు చేయలేక మట్టి నమూనాలను మొక్కుబడిగా సేకరించి పంపిస్తున్నారు. అదీ అనుకున్న సమయానికి కాకుండా ఆలస్యంగా పంపడంతో ప్రయోగశాలలో సైతం జాప్యం చేస్తున్నారు. ఖరీఫ్‌లో సేకరించిన నమూనాల ఫలితాలు రబీ చివరికి వచ్చే పరిస్థితి నెలకొంటుంది. కేంద్రం మూడేళ్లలో ప్రతి ఏటా మూడోవంతు రైతుల భూముల్లో మట్టి నమూనాలు సేకరించి భూసార పరీక్షలు చేయించి ఆరోగ్య కార్డులు అందజేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. కానీ క్షేత్ర స్థాయిలో అమలుకు నోచుకోవడంలేదు.


రైతు సమగ్ర సర్వే దరఖాస్తుల ఆన్‌లైన్ పనిలో ఏఈవో

పని ఒత్తిడి పెరిగి..

గత ఏప్రిల్ నుంచి వ్యవసాయ శాఖ సిబ్బందికి పని ఒత్తిడి బాగా పెరిగింది. సర్వే, రైతు చైతన్య యాత్రలు, అనంతరం రైతు సమగ్రసర్వే దరఖాస్తుల పరిశీలన.. ఇప్పటికి క్షణం తీరిక లేని పరిస్థితిలోనే ఉన్నారు. మండలానికి ముగ్గురు ఏఈవోలను కేటాయించి వారికి భూసార పరీక్షల కిట్‌లను అందజేశారు. అక్కడే మట్టి సేకరించి పరీక్షలు చేయాలని సంకల్పించారు. ఏఈవోలు ప్రస్తుతం సమగ్ర సర్వేలో వచ్చిన దరఖాస్తుల ఆన్‌లైన్ చేసే పనుల్లో నిమగ్నమయ్యారు. ఆన్‌లైన్ ప్రక్రియ మరో నెల రోజుల వరకు పట్టవచ్చని అధికారులు చెబుతున్నారు. ఆన్‌లైన్ పూర్తయి మట్టినమూనాల వద్దకు వచ్చే నాటికి ఖరీఫ్ పంటకాలం పూర్తవుతుంది. అపుడు ఫలితాలు వచ్చినా ప్రయోజనం ఉండదని రైతులంటున్నారు.

2017-18 సంవత్సరానికి మట్టి నమూనాల సేకరణ, ఆన్‌లైన్ నమోదు, పరీక్షల ఫలితాలు, భూఆరోగ్యకార్డుల పంపిణీపై ఇచ్చిన లక్ష్యం చేరుకున్న తీరు ఇలా..

మండలం	నమూనాల సేకరణ లక్ష్యం	నమూనాలు సేకరించినవి	ఆన్‌లైన్ నమోదు ఇచ్చిన లక్ష్యం	ఏఈవోలకు	చేరుకున్నది
హుజూర్‌నగర్	1,820	1,820	217	450	10
మఠంపల్లి	1,005	1,005	325	300	10
మేళ్లచెరువు	707	707	700	300	10
గరిడేపల్లి	1,961	1,961	520	450	10
నేరేడుచర్ల	1,325	1,325	826	300	10
చింతలపాలెం	499	499	42	150	10
పాలకవీడు	672	672	310	150	10

పనుల ఒత్తిడి వల్ల జాప్యం..:

పద్మావతి, ఏడీఏ

గత ఏడాదిగా వ్యవసాయ శాఖపై పని ఒత్తిడి పెరిగింది. ఒకదాని వెంట మరో పని వస్తుండటంతో తీరిక ఉండటం లేదు. దీంతో సకాలంలో పరీక్షలు చేయించలేకపోతున్నాం. మట్టి నమూనాలు సేకరించాం. ఆన్‌లైన్ చేయడం.. పరీక్షలు చేయించడంలోనే ఆలస్యమవుతుంది. కిట్‌లు వచ్చినా నెల వరకు పరీక్షలు చేయడం కొంత కష్టమే.

ఏకరూప దుస్తుల పంపిణీ

లక్కవరం(హుజూర్‌నగర్ గ్రామీణం), న్యూస్‌టుడే: గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు ఏకరూప దుస్తులను సర్పంచి చామకూరి గురుపాదం బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం రాష్ట్రంలో పేద విద్యార్థుల కోసం పలు పథకాలను ప్రవేశపెట్టిందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎస్ఎంసీ ఛైర్మన్ మట్టయ్య, ప్రధానోపాధ్యాయుడు జహూర్‌ఆలం, ఉపాధ్యాయులు పీఎల్ఎన్ రెడ్డి, వెంకటేశ్వర్లు, ముత్యాలరావు, సైదాబీ తదితరులు పాల్గొన్నారు.


లక్కవరంలో ఏకరూప దుస్తులు పంపిణీ చేస్తున్న సర్పంచి గురుపాదం

గ్యాస్ సమాచారం

హుజూర్‌నగర్, న్యూస్‌టుడే: హుజూర్‌నగర్ ఇండేన్ వెంకటేశ్వర గ్యాస్ ఏజెన్సీ పరిధిలో గురువారం పాలకవీడు, బక్కమంతులగూడెం, చౌటపల్లి, మఠంపల్లి, రఘునాథపాలెం, మట్టపల్లి, హుజూర్‌నగర్ నగర పంచాయతీ పరిధిలో గ్యాస్ సరఫరా జరుగును.

కూరగాయల ధరలు

(నిన్నటి ధరలు) కిలో ఒక్కంటికి రూ.లలో

హుజూర్‌నగర్ గ్రామీణం, న్యూస్‌టుడే: టమాటా: 40, దోసకాయ: 30, దొండకాయ: 30, బెండకాయ: 30, కాకరకాయ: 40, గోకరకాయ: 40, బీరకాయ: 40, వంకాయ: 30, ఆలుగడ్డ: 30, చామగడ్డ: 40, క్యాబేజి: 30, కీరా: 40, క్యారెట్: 60, బీట్‌రూట్: 40, క్యాప్సికం: 60, పచ్చిమిర్చి: 60.
నేరేడుచర్ల: ఆలుగడ్డ 20, పచ్చిమిర్చి 40, వంకాయ 40, బెండకాయ 30, దోసకాయ 20, టమాటా 50, చామగడ్డ 40, గోకరకాయ 30, పొట్లకాయ 30, బీరకాయ 40, కాకరకాయ 40, క్యాబేజీ 30, దొండకాయ 30, కీరా 30, చిక్కుళ్లు 40, బీట్‌రూట్ 40, మునగ 60, క్యాప్సికం 60, క్యారెట్ 60.

సినిమాలు

హుజూర్‌నగర్: **శ్రీనివాస:** జయ జానకి నాయక, **సాయిబాబా:** నేనే రాజు నేనే మంత్రి, **నేరేడుచర్ల: వెంకట్రామ:** నేనే రాజు నేనే మంత్రి

మీరూ స్పందించండి..

మీరు ఎదుర్కొంటున్న సామాజిక సమస్యలపై స్పందించండి. వాటిని అధికారుల దృష్టికి తీసుకెళ్లేందుకు 'ఈనాడు' వేదికగా నిలుస్తుంది. మీరు చేయాల్సిందల్లా సమస్యను ఫొటో తీసి, సంబంధిత వివరాలు క్లుప్తంగా రాసి వాట్సాప్ ద్వారా మాకు పంపించండి.

వాట్సాప్ సెల్ నెంబర్లు:
హుజూర్‌నగర్: 96030 18889; నేరేడుచర్ల: 80085 74435
మేళ్లచెరువు: 97018 21971
మఠంపల్లి: 80085 74420; గరిడేపల్లి: 80085 74395
హుజూర్‌నగర్ గ్రామీణం: 80085 66100

ప్రమాదకరంగా నీటి గుంతలు


హుజూర్‌నగర్‌లో గోదాము బజారులో గుంతపై ఉంచిన బండ

పట్టణంలోని చాలా వీధుల్లో నీళ్ల కోసం ఏర్పాటు చేసుకున్న గుంతలు ప్రమాదకరంగా మారాయి. వీధుల్లో పిల్లలు ఆడుకునేందుకు బయటకు వస్తే దానిలో పడే అవకాశముంది. ఇటీవల ఓ విద్యార్థి దానిలో పడటంతో.. స్థానికులు వెంటనే అతడి బయటకు లాగి దానిపై బండ పెట్టారు. నగరపంచాయతీ అధికారులు వెంటనే స్పందించి గుంతలపై మూతలు వేయాలి.

పంపిన వారు: జానిపాషా, హుజూర్‌నగర్

సమాధానం: రోడ్డు వెంట నీటి కోసం తీసిన గుంతలు ఉంటే వాటిపై మూతలు ఏర్పాటు చేయిస్తాం. ప్రమాదకరంగా ఉంటే వాటిని తొలగించేందుకు చర్యలు తీసుకుంటాం.– కమిషనర్, నగర పంచాయతీ

సేకరణ: హుజూర్‌నగర్, న్యూస్‌టుడే

రోడ్డు ఎక్కుతున్న మురుగునీరు

కొత్తగూడెంలోని కాలనీ వెళ్లే రోడ్డుపైకి మురుగునీరు వస్తుంది. డ్రైనేజీలు కిందకు ఉండి.. రోడ్డు పైకి ఉండటంతో వ్యర్థాలన్నీ కాల్వలో పడి నీరు వెళ్లకుండా అడ్డుకుంటున్నాయి. ఫలితంగా దుర్వాసన వ్యాపిస్తోంది. మురుగు కాల్వల ఎత్తు పెంచి తగు చర్యలు తీసుకోవాలి.

పంపిన వారు: మచ్చ సైదులు, కొత్తగూడెం

సమాధానం: రెండు, మూడు రోజుల్లో నిర్మాణ పనులు చేపడతాం. వారంలో అంతా పూర్తవుతుంది. సమస్యలేకుండా చూస్తాం. – మంగళగిరి నాగరాజు, సర్పంచి

సేకరణ: కొత్తగూడెం(గరిడేపల్లి), న్యూస్‌టుడే


కొత్తగూడెంలో రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగు

రైతులకు తుంపర సేద్యం పరికరాల పంపిణీ

రఘునాథపాలెం(మఠంపల్లి), న్యూస్‌టుడే: తుంపర సేద్యం ద్వారా రైతులు సాగు నీటిని పొదుపు చేయడంతో పాటు మెట్ట పంటల్లో అధిక దిగుబడులు సాధించవచ్చని


రఘునాథపాలెంలో రైతుకు అందజేసిన తుంపర సేద్యం పరికరాలతో అధికారులు

ఉద్యాన, పట్టు పరిశ్రమశాఖ హెచ్ఈవో ప్రభాకర్ అన్నారు. బుధవారం రఘునాథపాలెంలో రైతులకు 75శాతం రాయితీతో ప్రభుత్వం అందజేస్తున్న తుంపర సేద్య పరికరాలను అందజేసి మాట్లాడారు. 15 మందికి ఈ పరికరాలు ఇచ్చినట్లు తెలిపారు. పత్తి, మిరప, వేరుశనగ పంటలతో పాటు కూరగాయల సాగుకు తుంపర సేద్యం అనుకూలంగా ఉంటుందన్నారు. 25శాతం వాటా ధనం చెల్లించి వీటిని ఉద్యాన విస్తరణాధికారి ద్వారా పొందవచ్చన్నారు. సాముల పుల్లారెడ్డి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

హుజూర్‌నగర్

విద్యార్థుల ప్రతిభ

నేరేడుచర్ల, న్యూస్‌టుడే: నల్గొండలో జూడో అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కరాటే పోటీలలో నేరేడుచర్ల కృష్ణవేణి టాలెంట్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ చూపారని ప్రధానోపాధ్యాయుడు ఎం.రమేష్ తెలిపారు. బుధవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థులను అభినందించారు. ఆర్.హరిప్రకాష్, కె.విష్ణు, సీహెచ్.రాజేష్, ఆర్.అజయ్ బంగారు పతకాలు సాధించారని పేర్కొన్నారు. ఆర్.భాను ప్రకాష్, ఎస్.కె.రహీం, ఎం.వినోద్, ఎస్.కె.పర్వేజ్ రజత, కాంస్య పతకాలు సాధించామన్నారు. పాఠశాల డైరెక్టర్ జగన్మోహన్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సిబ్బంది లేక పశు వైద్యశాలలకు తాళం

● చికిత్సలకు నోచుకోని మూగజీవాలు


పెదవీడులో సిబ్బంది లేక మూత పడిన పశువైద్యశాల

మఠంపల్లి, న్యూస్‌టుడే

సిబ్బందిలేక 13 గ్రామ పంచాయతీల పరిధిలో ఉన్న పశువులు, జీవాలకు వైద్యం అందని పరిస్థితి మఠంపల్లి మండలంలోని పెదవీడు, రఘునాథపాలెం ఆర్ఎల్‌యూలలో నెలకొంది. ఇక్కడి ఎల్ఎస్‌యూ (ఉప వైద్యశాలలు)లలో ఎల్ఎస్ఏ, అటెండర్ ఉండాల్సి ఉండగా పెదవీడులో ఉన్న ఒక్క ఎల్ఎస్ఏ ఇటీవల పదోన్నతిపై బదిలీ అయ్యారు. కాగా రఘునాథపాలెంలో ఎల్ఎస్ఏ, అటెండర్ పోస్టులు సంవత్సర కాలంగా ఖాళీగా ఉన్నాయి. ఈ ఆర్ఎల్‌యూల పరిధిలో 13 పంచాయతీలు 15 వరకు ఆవాస గ్రామాలు ఉన్నాయి. పశువులకు తరచూ వచ్చే సాధారణ వ్యాధులకు సైతం చికిత్సలు చేసే సిబ్బంది లేకపోవడంతో మూగ జీవాలు మృత్యువాత పడుతున్నాయని రైతులు చెబుతున్నారు. సంవత్సరాల తరబడి ఖాళీలు భర్తీ చేయకపోవడంతో అవస్థలు పడుతున్నామని పేర్కొంటున్నారు. ఇద్దరు సిబ్బంది ఉండాల్సిన ఆసుపత్రులలో కనీసం ఒక్కరు కూడా లేకపోవటంతో కేంద్రాలకు తాళమే కనిపిస్తోంది. వెంటనే సిబ్బందిని నియమించి పశువులకు వైద్యం అందేలా చూడాలని కోరుతున్నారు.

పశుపోషకుల అవస్థలు పట్టవా?..:

– ఎస్.వెంకటేశ్వరరెడ్డి, పెదవీడు

గ్రామీణ పశువైద్యశాలల్లో సిబ్బంది లేక వేలాది రూపాయల విలువైన మూగ జీవాలు మృతిచెందుతున్నాయి. ఈ విషయాన్ని ఇప్పటికే పలుమార్లు సంబంధిత శాఖ అధికారుల దృష్టికి తీసుకువెళ్లాం. జేడీని స్వయంగా కలిసి వినతి పత్రాన్ని కూడా అందజేశాం. దశాబ్దాల నాటి ఇక్కడి భవనం శిథిలావస్థకు చేరి ఎప్పుడు కూలుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. సిబ్బందిని నియమించడంతో పాటు నూతన భవనాన్ని నిర్మించేలా చర్యలు తీసుకోవాలి.

అత్యవసర పరిస్థితుల్లో వైద్యసేవలందిస్తున్నాం

– కె.శంకర్, మండల పశువైద్యాధికారి



మండలంలోని రెండు ఎల్ఎస్‌యూలలో ప్రస్తుతం సిబ్బంది లేరు. మఠంపల్లిలో వీఏ, అటెండర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అత్యవసర పరిస్థితుల్లో ఆర్ఎల్‌యూల పరిధిలో సేవలందిస్తున్నాం. పశు పోషకులు ఇబ్బందులు పడుతున్న విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లాం.

కనీస వేతన చట్టం అమలుచేయాలి


హుజూర్‌నగర్‌లో మాట్లాడుతున్న యూసుబ్

హుజూర్‌నగర్ గ్రామీణం, న్యూస్‌టుడే: కార్మికులకు కనీస వేతన చట్టం అమలుచేయాలని రాష్ట్ర మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎండీ యూసుబ్ డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక ఏరియా ఆసుపత్రిలో జరిగిన పొరుగు సేవల, ఒప్పంద కార్మికుల సర్వసభ్య సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వం కార్మికుల శ్రమను దోపిడీ చేస్తుందన్నారు. కోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల హక్కులను కాలరాస్తున్నాయని విమర్శించారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలుచేయటంలో తెరాస ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. పారిశుద్ధ్య కార్మికులందరికీ పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలన్నారు. ఏఐటీయూసీ జిల్లా కన్వీనర్ మేకల శ్రీనివాస్, అమరగాని కృష్ణ, కె.సత్యంరాజు, జడ శ్రీను, బాలజీ, జీవన్, కృష్ణ, మంగమ్మ, ఆసుపత్రి పర్యవేక్షకులు ప్రవీణ్‌కుమార్, వనజ, కాంట్రాక్టర్ అమర్‌నాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎప్పటికప్పుడు వివరాలు పొందుపర్చాలి


హుజూర్‌నగర్‌లో ప్రజా వేదికలో పాల్గొన్న ఏపీడీ సుదర్శన్‌రావు తదితరులు

హుజూర్‌నగర్ గ్రామీణం, న్యూస్‌టుడే: చేపడుతున్న పనులపై ఎప్పటికప్పుడు నివేదికల్లో వివరాలు పొందుపరచాలని క్షేత్ర సహాయకులకు ఏపీడీ సుదర్శన్‌రావు సూచించారు. బుధవారం మండలంలోని ఉపాధి హామీ పనులపై నిర్వహించి సామాజిక తనిఖీ ప్రజా వేదికలో పాల్గొని మాట్లాడారు. మండలంలోని 9 గ్రామ పంచాయతీ పరిధిలో ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టిన పనులకు సంబంధించి రూ.2.24 కోట్ల నిధులు ఖర్చు చేశారన్నారు. వేపలసింగారంలో రెండు, బూరుగడ్డలో మూడు పూడిక తీసిన కాల్వలను రైతులు పూడ్చగా వాటినీ తీయించాలని ఆదేశించారు. బ్లూఫామ్ నిర్వహించన క్షేత్ర సహాయకులందరికీ సాధారణ నోటీసులు పంపుతామన్నారు. లింగగిరి బీపీఎం పనితీరుపై సర్పంచి ఫాతిమా ఫిర్యాదు చేయగా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. ఎస్టీఎం రజిత, ఎంపీపీ గొట్టెముక్కుల నిర్మల, ఎస్ఆర్పీ రాఘవులు, డీర్పీ సైదులు, ఏపీవో నిర్మల, టీఏ సతీష్ రెడ్డి, సర్పంచులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

నేరేడుచర్ల, న్యూస్‌టుడే: వినాయకుడి మట్టి విగ్రహాలను పూజించి పర్యావరణాన్ని కాపాడాలని జనవిజ్ఞాన వేదిక జిల్లా నాయకుడు సుంకరి క్రాంతికుమార్ బుధవారం ఒక ప్రకటనలో కోరారు. నేరేడుచర్లలో జేవీవీ ఆధ్వర్యంలో శుక్రవారం మట్టి విగ్రహాల పంపిణీ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

గరిడేపల్లి, న్యూస్‌టుడే: రాష్ట్రంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారంలో తెరాస ప్రభుత్వం విఫలమైందని సీపీఎం మండల కార్యదర్శి షేక్.యాకూబ్ విమర్శించారు. బుధవారం గడ్డిపల్లిలో సంధ్యల సైదులు అధ్యక్షతన జరిగిన పార్టీ ప్రాంతీయ సమావేశంలో మాట్లాడారు. రామయ్య, సైదులు, బక్కయ్య, సోమయ్య, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

గరిడేపల్లి, న్యూస్‌టుడే: తెలంగాణ మాదిగ ఐకాస మండల అడ్‌హక్ కమిటీని ఎంపికచేసినట్లు జిల్లా అధ్యక్షుడు కె.గోవిందరావు ప్రకటించారు. అధ్యక్షుడిగా బండారు నర్సయ్య, ఉపాధ్యక్షుడిగా నకిరేకంటి యర్రయ్య, ప్రధాన కార్యదర్శిగా కస్తాల సందీప్‌కుమార్, సహాయ కార్యదర్శిగా ఏపూరి వినోద్‌ను నియమించినట్లు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

లక్కవరం(హుజూర్‌నగర్ గ్రామీణం), న్యూస్‌టుడే: గ్రామంలోని బీసీ కాలనీకి వెళ్లే దారి సక్రమంగా లేక చాలా ఇబ్బందులు ఎదురవుతున్నాయని.. వెంటనే రోడ్డు ఏర్పాటు చేయాలని వైస్ ఎంపీపీ కొనుగంటి మధుసూదన్‌రెడ్డి అధికారులను కోరారు. బుధవారం లక్కవరం విలేకర్లతో మాట్లాడారు.

నేరేడుచర్ల, న్యూస్‌టుడే: భాజపా మండల కమిటీ సభ్యులను నియమించినట్లు ఆపార్టీ మండల అధ్యక్షుడు చిన్నపల్లి శ్రీనివాస్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉపాధ్యక్షుడిగా జూలూరి అశోక్, ప్రధానకార్యదర్శిగా అంబటి నాగేశ్వరరావును నియమించినట్లు పేర్కొన్నారు.

హుజూర్‌నగర్, న్యూస్‌టుడే: పట్టణంలో కనకదుర్గమ్మ జాతరను గురువారం నిర్వహించనున్నారు.

కరక్కాయలగూడెం(హుజూర్‌నగర్ గ్రామీణం), న్యూస్‌టుడే: గ్రామంలోని బయోస్టాంట్ కంపెనీ ఆధ్వర్యంలో రైతులకు అవగాహన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఆ కంపెనీ రీజనల్ మేనేజర్ ఎంవీ జనార్ధన్‌రెడ్డి, జిల్లా సేల్స్ అధికారి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

హుజూర్‌నగర్ గ్రామీణం, న్యూస్‌టుడే: బూరుగడ్డలోని ఆదివరాహ లక్ష్మీనృసింహ వేణుగోపాలస్వామి ఆయల కమిటీ సభ్యులు నందిగామ నాగమణి, మాడ్గుల కనకయ్య, గువ్వల ఆయోద్య, పొదిల నాగరాజు తెరాస నియోజకవర్గ ఇన్‌ఛార్జి కాసోజు శంకరమ్మను ఆమె నివాసంలో బుధవారం కలిశారు. తెరాస కార్మిక విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు పచ్చిపాల ఉపేందర్, పట్టణ ప్రధాన కార్యదర్శి రాయల వెంకటేశ్వర్లు, పల్లెపంగు నాగరాజు, జింకల భాస్కర్, గూడెపు చంద్రయ్య, కస్తాల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

హుజూర్‌నగర్, న్యూస్‌టుడే: కొత్తగా హుజూర్‌నగర్ వచ్చిన తహసీల్దారు చంద్రశేఖర్‌రావును వైకాపా నాయకులు బుధవారం సన్మానించారు. ఆపార్టీ రాష్ట్ర కార్యదర్శి వేముల శేఖర్‌రెడ్డి, రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యదర్శి కస్తాల ముత్తయ్య, జిల్లా అధికార ప్రతినిధి సుతారి శ్రీనివాసరావు, జడ రామకృష్ణ, మల్లీశ్వరి, శివ తదితరులు పాల్గొన్నారు.

పల్లె కబుర్లు

నేరేడుచర్ల, న్యూస్‌టుడే:

దిర్శించర్ల: జగనతండా రోడ్డు వెంట కంపచెట్లు తొలగించాలని, గుంతలు పూడ్చాలని గ్రామస్థులు కోరుతున్నారు.

కమలానగర్: గ్రామం నుంచి ఘంటవారిగూడెం వెళ్లే రోడ్డును బాగు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

సోమారం: బూర్గులతండాలో మంచినీటి ట్యాంకు చుట్టూ మురుగు నీరు నిలవకుండా చూడాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

బోడల్‌దిన్న: మూసీనది నుంచి జోరుగా ట్రాక్టర్లపై ఇసుక రవాణా జరుగుతోంది.

మూత్రపిండాల రోగులకు శుభవార్త

◆ హుజూర్‌నగర్‌లోనే మూత్రపిండాల చికిత్స కేంద్రం ◆ ఆరు నెలల నిరీక్షణకు తెరదించిన ప్రభుత్వం

హుజూర్‌నగర్, న్యూస్‌టుడే: మూత్రపిండాల రోగులకు శుభవార్త.. ఇక హుజూర్‌నగర్‌లోనే మూత్రపిండాల రోగులకు చికిత్స చేసేందుకు అవసరమైన యూనిట్‌ను ఏర్పాటు చేస్తూ ఆరు నెలల క్రితం తీసుకున్న నిర్ణయం ఎట్టకేలకు కార్యరూపం దాల్చింది. అందుకు అవసరమైన యంత్ర పరికరాలను కొనుగోలు చేసి వెంటనే చికిత్సలు అందించేందుకు చర్యలు చేపట్టింది. వారం, పది రోజుల్లో కేంద్రం ప్రారంభం అవుతుందని అధికారులు చెబుతున్నారు. ప్రభుత్వ ఆసుపత్రులలో ఆధునిక వైద్యసేవలు అందించేందుకు ఆరు నెలల క్రితం ప్రభుత్వం పలు నిర్ణయాలు తీసుకుంది. అందులో భాగంగా జిల్లాలో మూత్రపిండాల చికిత్స కేంద్రం (డయాలసిస్ కేంద్రాలు) ఏర్పాటు చేయాలని సంకల్పించింది. హుజూర్‌నగర్, సూర్యాపేట ఏరియా ఆసుపత్రులకు డయాలసిస్ కేంద్రాలను మంజూరు చేసింది. హుజూర్‌నగర్‌లో ఐదు యూనిట్లు మంజూరు చేశారు. ఈమేరకు వైద్య ఆరోగ్యశాఖ మంత్రి ఉత్తర్వులు జారీ చేశారు. అవసరమైన యంత్రపరికరాల కొనుగోలుకు సంబంధించి టెండర్ల ప్రక్రియ ప్రారంభం అయింది.


హుజూర్‌నగర్ ఏరియా ఆసుపత్రి

త్వరలో వైద్యసేవలు అందుబాటులోకి..

జిల్లాలో ఎక్కడా మూత్రపిండాల రోగులకు డయాలసిస్ చేయించుకునే సౌకర్యం లేక ఇన్నాళ్లు ఇబ్బందులు పడ్డారు. ఆరోగ్యశ్రీ, ఇతర ఆరోగ్య పథకాల కింద రోగులకు ప్రభుత్వం ఆర్థిక సహాయం అందిస్తున్నా మూత్రపిండాల రోగబాధితులు దూరప్రాంతాలకు వెళ్లి వైద్యం చేయించుకోవటానికి అవస్థలు పడుతున్నారు. హుజూర్‌నగర్ ఏరియా ఆసుపత్రిలో డయాలసిస్ కేంద్రం ఏర్పాటు చేయటం వల్ల హుజూర్‌నగర్, కోదాడ నియోజకవర్గాలలోని మూత్రపిండాల వ్యాధి బాధితులకు ఎంతో మేలు జరుగుతుంది.

పెరుగుతున్న రోగులు..

వివిధ కారణాలతో మూత్రపిండాల రోగుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. వీరిలో కొందరు సొంత ఖర్చులతో వివిధ ప్రాంతాల్లో వైద్యం చేయించుకుంటున్నారు. ఎక్కువ రోగులు మాత్రం ఆరోగ్యశ్రీ పథకం ద్వారా వైద్యం చేయించుకుంటున్నారు. డయాలసిస్ కేంద్రాలను ఎక్కడికక్కడ ఏర్పాటు చేయటం వల్ల రోగులకు ప్రయాణ ఇబ్బందులు, అదనపు ఖర్చులు తగ్గుతాయి. హుజూర్‌నగర్ ఏరియా ఆసుపత్రిలో భవన సౌకర్యం ఉన్నందున ఇతర ఏర్పాట్ల పనులు జరుగనున్నాయి. ఈ కేంద్రానికి అవసరమైన కుర్చీలు, బల్లాలు, ఒక వైద్యుడిని, మరి కొంతమంది సిబ్బందిని కూడా కేటాయిస్తారు. ఆరు నెలల ఎదురుచూపులకు తెరదించుతూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం వల్ల మూత్రపిండాల రోగులకు కొద్ది రోజుల్లోనే హుజూర్‌నగర్ ఏరియా ఆసుపత్రుల్లో వైద్య సేవలు అందుబాటులోకి రానున్నాయి.

ఆ క్వారీని మూసేయండి

చింతలపాలెం (మేళ్లచెరువు), న్యూస్‌టుడే: చింతలపాలెం రెవెన్యూ పరిధిలో సిమెంట్ పరిశ్రమకు సంబంధించిన సున్నపు రాయి క్వారీ పనులను వెంటనే నిలిపివేయాలని కోరుతూ ఆ గ్రామస్థులు బుధవారం తహసీల్దారుకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నిబంధనలకు విరుద్ధంగా 100 అడుగులకు పైచిలుకు తవ్వి రాయిని తరలిస్తున్నారని పేర్కొన్నారు. దీనివల్ల సమీప ప్రాంతంలోని వ్యవసాయ బోరు బావుల్లో నీరు అడుగంటిపోతోందని వాపోయారు. ఈ క్వారీ ప్రభావం వల్ల గ్రామ పరిధిలో భూగర్భ జలాలు అడుగంటిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజలకు అన్ని విధాలా తీవ్ర అసౌకర్యం కలిగిస్తున్న క్వారీని నిలిపివేయాలని విజ్ఞప్తి చేశారు. మోర్తాల వెంకటరెడ్డి, శ్రీను, అనిల్‌కుమార్, సైదిరెడ్డి, సోమయ్య, బషీర్, రాజా తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగుల్లో చిగురిస్తున్న ఆశలు



పాతజిల్లా ప్రాతిపదికన నియామకాలు

ఉమ్మడి జిల్లాలో గుర్తించిన ఉపాధ్యాయ పోస్టులు 1592

పాతజిల్లా ప్రాతిపదికన ఉద్యోగ నియామకాలు చేపట్టాలన్న నిరుద్యోగుల అభ్యర్థన ఎట్టకేలకు కార్యరూపం దాల్చనుంది. రాష్ట్రపతి ఉత్తర్వులు అమల్లో ఉన్నందున ఉద్యోగాల భర్తీకి పాతజిల్లాలనే పరిగణలోకి తీసుకోవాలని రాష్ట్రప్రభుత్వం నిర్ణయించింది. ఈ తాజా నిర్ణయం పట్ల నిరుద్యోగుల అభ్యర్థుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. ప్రధానంగా ఇతర ఉద్యోగాల కంటే ఉపాధ్యాయ ఎంపిక పరీక్ష(డీఎస్సీ) కోసం ఉమ్మడి జిల్లాలో 20 వేల మందికి పైగా నిరుద్యోగులు ఎదురుచూస్తున్నారు. కొత్తజిల్లాలవారీగా కాకుండా ఉమ్మడిజిల్లా ప్రాతిపదికన నియామకాలు చేపట్టాలని నిరుద్యోగులు డిమాండ్‌చేస్తున్న సంగతి తెలిసిందే. ప్రభుత్వం నియామకాల విషయంలో స్పష్టతనివ్వడంతో సంబంధీకుల్లో హర్షం వ్యక్తమవుతోంది. ఈనేపథ్యంలో ఉమ్మడి జిల్లాలో ఉన్న ఉపాధ్యాయ పోస్టుల వివరాలు, డీఎస్సీ నిర్వహణ తదితర అంశాలతో కూడిన 'న్యూస్‌టుడే' కథనం.

పాలనాప్రాంగణం, **ఆదిలాబాద్ అర్బన్, న్యూస్‌టుడే**

పోస్టులు తక్కువ.. పోటీ ఎక్కువ

జిల్లాలో ఒకట్రెండు పోస్టులు ఉండే ఇతర శాఖల ఉద్యోగాల కంటే వందల సంఖ్యలో భర్తీచేసే ఉపాధ్యాయుల పోస్టులపైనే నిరుద్యోగులు అత్యధికంగా ఆశలు పెట్టుకున్నారు. ఈ క్రమంలో అందుకు అవసరమయ్యే డీఎడ్, బీఎడ్ శిక్షణ పూర్తి చేసిన అభ్యర్థులు సంఖ్య ఏటేటా పెరుగుతూ పోతోంది. దీనికితోడు ప్రభుత్వం ఉపాధ్యాయ పరీక్షకు అర్హతగా టెట్ నిర్వహిస్తోంది. ఉపాధ్యాయ పోస్టుల భర్తీ ప్రకటన నేపథ్యంలో కిందటి నెల జులై 23న టెట్ పరీక్ష నిర్వహించింది. ఈ పరీక్షకు ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 23,739మంది హాజరు కాగా.. పేపర్-1 పరీక్షలో 8449 మందికి 4923మంది, అదేవిధంగా పేపర్-2 పరీక్షలో 15,290మందికిగాను కేవలం 3,262మంది మాత్రమే అభ్యర్థులు అర్హత సాధించారు. తాజాగా నిర్వహించిన టెట్ పరీక్షను బట్టి జిల్లాలో 8,185మంది ఉపాధ్యాయఎంపిక పరీక్ష రాసేందుకు అర్హులన్నమాట. అయితే గతంలో 2012లో నిర్వహించిన టెట్‌లో మరో ఐదువేల మంది అర్హత సాధించి ఉన్నారు. అందరిని కలుపుకుంటే ఉమ్మడిజిల్లావ్యాప్తంగా గతంలో, తాజాగా నిర్వహించిన టెట్‌లో అర్హత సాధించిన అభ్యర్థులు 15 వేలకు మించి ఉండరని విద్యాశాఖవర్గాలు చెబుతున్నాయి. ఇందులో ఎస్జీటీ పరీక్ష రాసేవారు 6వేల మంది ఉంటే.. మిగిలిన వారంతా స్కూల్‌అసిస్టెంట్ పరీక్షకు హాజరయ్యే అవకాశముందని ఆశాఖ అధికారుల అంచనా. ఉమ్మడి రాష్ట్రంలో 2012లో అప్పటి ప్రభుత్వం డీఎస్సీ నిర్వహించింది. తదనంతరం రాష్ట్ర విభజన ఉద్యమాలు.. కొత్త రాష్ట్రం ఏర్పాటు తదితర కారణాల వల్ల నియామక పరీక్ష నిర్వహణకు ఆటంకాలు ఎదురవుతూ వచ్చాయి. ఇప్పటికే టీఎస్‌పీఎస్సీ ద్వారా వివిధ శాఖల్లో కొంత వరకు పోస్టులు భర్తీ చేసినప్పటికీ.. ఉపాధ్యాయ నియామకాలను చేపట్టడం లేదు. దీంతో ఐదేళ్ల కిందటి డీఎస్సీలో ఎంపిక కానివారితో పాటు తదనంతరం డీఎడ్, బీఈడీ పూర్తిచేసిన అభ్యర్థులు ఈ పరీక్ష కోసం ఎదురుచూస్తున్నారు. ఇప్పటికే ఆలస్యం కావడంతో అభ్యర్థుల మధ్య పోటీ తీవ్రంగా పెరిగింది. పోస్టుల సంఖ్యకు పోటీపడే అభ్యర్థుల సంఖ్యకు భారీగా తేడాలు కనిపిస్తున్నాయి. ప్రధానంగా స్కూల్‌అసిస్టెంట్ సోషల్, బయోసైన్సులో ఒక్కో పోస్టుకు సగటున 500మంది అభ్యర్థులు పోటీపడే అవకాశముందని విద్యాశాఖ వర్గాలు గతంలో జరిగిన డీఎస్సీకి హాజరైన అభ్యర్థుల సంఖ్యను బట్టి చెబుతున్నారు. ఎస్జీటీల్లో మాత్రం పోటీ చాలా తక్కువగా ఉంటోందంటున్నారు. కిందటి డీఎస్సీలో ఒక్కో పోస్టుకు ముగ్గురు నుంచి ఐదుగురు పోటీపడగా.. ఈసారి ఆసంఖ్య పదిలోపు ఉండవచ్చని విద్యాశాఖవర్గాలు భావిస్తున్నాయి. ప్రస్తుతం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 1592పోస్టులు ఖాళీగా ఉన్నట్లు విద్యాశాఖాధికారులు ప్రభుత్వానికి ఇదివరకే ప్రతిపాదనలు సమర్పించారు. ఈ పోస్టులు దక్కించుకునేందుకు పాత జిల్లాలో సుమారు 15వేల మంది వరకు పోటీపడే అవకాశం ఉంది. ఇప్పటికే శిక్షణ పూర్తిచేసుకున్న అభ్యర్థులు కొందరు కుటుంబ బాధ్యతల రిత్యా ప్రైవేటు ఉద్యోగాలు చేస్తూ పోటీ పరీక్షలకు సిద్ధమవుతుండగా.. ఈ పోస్టులు ఎలాగైనా దక్కించుకోవాలని మరికొందరు అభ్యర్థులు చదువులోనే నిమగ్నమయ్యారు. జిల్లాల విభజన నేపథ్యంలో కొత్తజిల్లాల వారీగా నియామకాలు చేపడతారని ప్రచారం జరగడంతో పరీక్షకు సన్నద్ధమవుతున్న అభ్యర్థుల్లో ఆందోళన వ్యక్తమైంది. అసలే పోస్టులు తక్కువగా ఉండటం.. జిల్లాలవారీగా నిర్వహిస్తే తమకు అన్యాయం జరుగుతుందని ఆవేదన చెందారు. ఆందోళనలు చేపట్టారు. ప్రభుత్వం ఎట్టకేలకు పాతజిల్లాల ప్రాతిపదికన నియామకాలు చేపడతామని ప్రకటించడంతో ఉద్యోగ ప్రకటనే తరువాయిగా నిరుద్యోగులు ఆశగా ఎదురుచూస్తున్నారు.

ఉమ్మడిజిల్లాలో ఇవీ ఉపాధ్యాయ ఖాళీలు..

జిల్లాలోని మైదాన ప్రాంతంలో

పోస్టుల వివరాలు	- 1014
☛ స్కూల్ అసిస్టెంట్లు	- 91
☛ లాంగ్వేజ్ పండిట్‌లు	- 74
☛ పీఈటీలు	- 22
☛ సెకండరీ గ్రేడ్ టీచర్లు	- 827

జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతంలో

పోస్టుల వివరాలు	- 578
☛ స్కూల్ అసిస్టెంట్లు	- 30
☛ లాంగ్వేజ్ పండిట్‌లు	- 48
☛ పీఈటీలు	- 03
☛ సెకండరీ గ్రేడ్ టీచర్లు	- 497

ముగిసిన నవోదయ క్లస్టర్ స్థాయి అథ్లెటిక్స్ పోటీలు

కాగజ్‌నగర్, న్యూస్‌టుడే: కుమురంభీం జిల్లా కాగజ్‌నగర్ జవహర్ నవోదయ విద్యాలయంలో తెలంగాణ నవోదయ 28వ క్లస్టర్ స్థాయి అథ్లెటిక్స్- ఎగ్జిబిషన్-2017-18 పోటీలు మంగళవారం సాయంత్రం ముగిశాయి. ముగింపు సమావేశానికి హాజరైన జిల్లా రవాణా శాఖ అధికారి శ్యాంనాయక్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లోని పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలనే ఉద్దేశంతో విద్యాలయాలను స్థాపించారన్నారు. సంస్కృతి, సంప్రదాయలకు విద్యాలయాలు నిలయాలన్నారు. పట్టుదల, దృఢమైన సంకల్పంతో విద్యార్థులను ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. విద్యాలయం ప్రిన్సిపల్ చక్రపాణి మాట్లాడుతూ క్లస్టర్ స్థాయి పోటీల విజయవంతానికి కృషి చేసిన ప్రతి ఒక్కరికి ఈసందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం అథ్లెటిక్స్, సైన్స్ ప్రదర్శనలో విజయం సాధించిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. మార్కెట్ కమిటీ ఛైర్‌పర్సన్ నర్సింగోజు పద్మసత్యనారాయణ, లయన్స్ క్లబ్ రీజినల్ ఛైర్మన్ డాక్టర్ శ్రీనివాస్, విద్యాలయం వైస్ ప్రిన్సిపల్ వసంతి కుమారి, పీఈటీలు మోహన్‌రావు, శైలజరెడ్డి, ప్రభుత్వ పీడీలు మధుసూదన్, సాంబశివరావు, జోసెఫ్, ఉపాధ్యాయులు మంజుల, భాస్కర్‌శర్మ, తదితరులు పాల్గొన్నారు. రాష్ట్రంలోని నల్గొండ, ఖమ్మం, మహబూబ్‌నగర్, మెదక్, వరంగల్, కరీంనగర్, నిజామాబాద్, రంగారెడ్డి, కాగజ్‌నగర్ విద్యాలయం విద్యార్థులు పాల్గొన్నారు. ముగింపు సమావేశానికి హాజరైన డీటీఓ, డాక్టర్ శ్రీనివాస్, తదితరులకు విద్యాలయం ఎన్‌సీసీ విద్యార్థుల ఆధ్వర్యంలో స్వాగతం పలికారు.



క్రీడాకారులకు బహుమతులు అందజేస్తున్న డీటీఓ శ్యాంనాయక్, తదితరులు

ఆధార్ అనుసంధానం చేసుకోవాలి

బీఎస్ఎన్ఎల్ డీజీఎం ఎస్.నాగిరెడ్డి

ఆదిలాబాద్ సాంస్కృతికం, న్యూస్‌టుడే: బీఎస్ఎన్ఎల్ వినియోగదారులు తమ సిమ్‌లను సమీప వినియోగ సేవా కేంద్రంలో ఆధార్ అనుసంధానం చేసుకోవాలని ఆ సంస్థ డీజీఎం ఎస్. నాగిరెడ్డి అన్నారు. మంగళవారం ఆయన జిల్లా కేంద్రంలోని జీఎంటీడీ బీఎస్ఎన్ఎల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ వచ్చే ఏడాది ఫిబ్రవరి లోపు సిమ్‌లను ఆధార్ అనుసంధానం చేసుకోవాలని, పరిమితి దాటితే సిమ్‌లు డిస్‌కనెక్ట్ అవుతాయన్నారు. ఈ ప్రక్రియ ఉచితంగా చేస్తారని, ఎవరైనా డబ్బులు అడిగితే వెంటనే తమకు ఫిర్యాదు చేయాలని కోరారు. అలాగే ఈనెల 28 నుంచి 30 తేదీల్లో ఉమ్మడి జిల్లాల్లోని ఆదిలాబాద్, నిర్మల్, కుమ్రంభీం, మంచిర్యాల జిల్లాల్లో ల్యాండ్‌లైన్ మేళాలు నిర్వహిస్తున్నామని, ఇందులో తమ సిబ్బంది ఇంటింటికెళ్లి ల్యాండ్‌లైన్, బ్రాడ్‌బ్యాండ్ గురించి ప్రజలకు అవగాహన కల్పిస్తారని చెప్పారు. ల్యాండ్‌లైన్ కనెక్షన్‌కు ఎలాంటి ఇన్స్టాలేషన్ ఛార్జీలు ఉండవని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగించుకోవాలని పేర్కొన్నారు.



పోటీలు ప్రారంభిస్తున్న పుర అధ్యక్షురాలు రంగినేని మనీష



పోటీల్లో తలపడుతున్న వివిధ పాఠశాలల జట్లు

హోరాహోరీగా జోనల్‌స్థాయి కార్ఫ్‌బాల్ పోటీలు

రాష్ట్రస్థాయిలో సత్తా చాటాలి: పుర అధ్యక్షురాలు మనీష

ఆదిలాబాద్ క్రీడావిభాగం, న్యూస్‌టుడే: జిల్లా పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల నెం.1లో 17, 19 ఏళ్ల విభాగం జోనల్‌స్థాయి కార్ఫ్‌బాల్ పోటీలు హోరాహోరీగా జరిగాయి. రాష్ట్రస్థాయి ఎంపికే ధ్యేయంగా క్రీడాకారులు ఆడారు. ఆదిలాబాద్, నిర్మల్, కుమురంభీం, మంచిర్యాల జిల్లాలకు చెందిన విద్యార్థులు పోటీలకు హాజరయ్యారు. ప్రారంభోత్సవానికి పుర అధ్యక్షురాలు రంగినేని మనీష హాజరై మాట్లాడారు. ఈ పోటీల్లో ఎంపికైన విద్యార్థులు రాష్ట్రస్థాయిలో సత్తాచాటాలని ఆకాంక్షించారు. పాత ఆదిలాబాద్ జిల్లా జట్టుకు ప్రతినిధ్యం వహిస్తున్న క్రీడాకారులు అత్యుత్తమ ప్రతిభ కనబర్చాలని తెలిపారు. అనంతరం క్రీడాకారులతో పరిచయం చేసుకొని పోటీలు ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా పాఠశాల క్రీడా సమాఖ్య నిర్వాహక కార్యదర్శి జక్కుల శ్రీనివాస్, పోటీల నిర్వాహకుడు ఎన్.హరిచరణ్, వ్యాయామ ఉపాధ్యాయులు దయానంద్‌రెడ్డి, రాష్ట్రపాల్, జె. సాయికుమార్, విఠల్‌రెడ్డి, శ్రీనివాస్, శ్రీవిద్య, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సలీమొద్దీన్, సిబ్బంది పిల్లి కిషన్, లక్ష్మణ్, మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.



మట్టి విగ్రహాలు ప్రతిష్ఠించాలని వీధినాటిక ద్వారా ప్రదర్శనలిస్తున్న కళాజాత బృందం

మట్టి విగ్రహాలే ప్రతిష్ఠించండి.. పర్యావరణాన్ని పరిరక్షించండి..

రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో కళాజాత

ఆదిలాబాద్ సాంస్కృతికం, న్యూస్‌టుడే: పర్యావరణాన్ని పరిరక్షించాలంటే మట్టి విగ్రహాలే ప్రతిష్ఠించాలని రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి కళాజాత ద్వారా ప్రచారం నిర్వహిస్తోంది. మంగళవారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని జనసమూహ కేంద్రాల్లో వీధి నాటిక కళాజాత బృందం పద్మారావు, వి.కుమార్, రాజా, వి.ప్రశాంత్‌లు పీఓపీ విగ్రహ ప్రతిష్ఠాపనతో కలిగే అనర్థాలను ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. పీఓపీ విగ్రహానికి విషపూరిత రసాయన రంగులు ఉంటాయని, ఇవి నీటిలో కరగకుండా పైకి తేలుతాయని, తద్వారా నీటిని సేవించిన పశుపక్ష్యాదులు మరణిస్తాయని, ప్రజలు ఉదరకోశ తదితర రుగ్మతలకు గురవుతారని వివరిస్తున్నారు. వినాయక చవితి సందర్భంగా ప్రతిఒక్కరూ మట్టి విగ్రహాలు మాత్రమే ప్రతిష్ఠించాలని, నిమజ్జనం చేసేటప్పుడు మట్టి వినాయకుడు నీటిలో తేలికగా కరిగిపోతుందన్నారు.

క్లిక్... క్లిక్



నాలుగు వరుసల రహదారి పక్కన ప్రమాదకరంగా పోసిన మట్టి, రాళ్లకుప్పలు

రహదారి 'ప్రమాద' భరితం!

జాతీయ రహదారి పక్కన మట్టితో పాటు బండరాళ్ల కుప్పలు ప్రమాదకరంగా వేశారు. ఆ మార్గంలో రాకపోకలు సాగించే వాహనదారులు ప్రమాదాలకు గురయ్యే అవకాశముంది. అధికారులు స్పందించి మట్టి, రాళ్ల కుప్పలను తొలగించాలని వాహనదారులే కాకుండా అటుగా వెళ్తోన్న గ్రామస్థులు కోరుతున్నారు.

- ఈనాడు ఆదిలాబాద్

నిమజ్జనానికి నీరు

➡ మూసీ ఎడమకాల్వకు నీటి విడుదల
➡ 'పేట' సద్దుల చెరువు నింపడానికి ఏర్పాట్లు

సూర్యాపేట గ్రామీణం - న్యూస్‌టుడే

ఇప్పటికే వరినాట్లు వేసుకున్న రైతులకు వినాయక పండుగ తీపి కబురు పంపింది. వినాయక నిమజ్జనం కోసం సూర్యాపేట పట్టణంలోని సద్దుల చెరువును మూసీ నీటితో నింపాలని కలెక్టర్ ఆదేశాల మేరకు బుధవారం మూసీ డీఈ నవనీత్‌కాంత్, ఏఈలు మమతా, స్వప్న మూసీ ప్రాజెక్టు నుంచి ఎడమ కాల్వకు 200 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. కాల్వలో నీటి రాక మొదలవడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయ పంటలకు నెలరోజుల పాటు నీటికి కొదవ ఉండదని సంబరపడుతున్నారు. ఎడమకాల్వ ద్వారా సూర్యాపేట మండలంలోని యండ్లపల్లి, పిన్నాయిపాలెం, పిల్లలమర్రి గ్రామాల్లో ఉన్న చెరువులను నింపుతారు. నీళ్లు లేక వెలవెల బోతున్న పిన్నాయిపాలెంలోని నల్లచెరువు నిండిన తర్వాతనే నీరు పిల్లలమర్రికి చేరుతుంది. పిల్లలమర్రిలోని శుభసముద్రంలో నీరు తక్కువగా ఉండటంతో అది నిండా నిండిన తర్వాత సూర్యాపేట పట్టణంలోని సద్దులచెరువుకు నీరు రానుంది. ఈ చెరువు నిండటానికి ఏడు నుంచి 10 రోజుల సమయం పట్టనుంది. అప్పటి వరకు సమీపంలో ఉన్న చెరువులూ నిండనున్నాయి. దీంతో పరిసర రైతుల బోర్లకు, బావులకు నీరు పుష్కలంగా చేరనుంది.


సూర్యాపేటలోని సద్దుల చెరువు


యండ్లపల్లి సమీపంలోని 9వ నెంబర్ వద్ద తూముకు షట్టరు లేకపోవడంతో రాళ్లకుప్పను వేసిన దృశ్యం

ఆయకట్టేతరకూ మేలు

ఎడమకాల్వకు నీరు వదలడం వల్ల రత్నపురం, రామారం, యండ్లపల్లి, టేకుమట్ల, పిన్నాయిపాలెం, పిల్లలమర్రి గ్రామాల్లో ఉన్న రైతులకు మేలు జరుగనుంది. చెరువులు నిండితే ఖరీఫ్‌లో సాగువుతున్న పంటలకు నీరు చేరనుంది. ఆయకట్టేతర భూముల్లో వ్యవసాయ సాగు చేసిన రైతులు మోటార్ల ద్వారా నీటిని తరలించుకు వెళ్లనున్నారు. పదిరోజుల పాటు మూసీ నీటిని వదిలితే కాల్వల్లో ఉన్న నీటితో మరో 20 రోజుల వరకు ఆయకట్టుయేతర భూములకు ఢోకా ఉండదు. సుమారు ఈ గ్రామాల్లో ఏడు వేల ఎకరాల్లో వ్యవసాయ పంటలు సాగు చేసినట్లు అధికారులు అంచనాలు వేసుకుంటున్నారు. చెరువుల నిండా నీరు ఉన్నందున మట్టి వినాయక విగ్రహాలను మాత్రమే చెరువుల్లో నిమజ్జనం చేయడానికి అనుమతులు ఇవ్వాలని ఇప్పటికే గ్రామ పంచాయతీలు, పురపాలిక అధికారులకు కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు.

తూములకు షట్టర్లు కరవు

మండలంలోని యండ్లపల్లి, పిన్నాయిపాలెం గ్రామాల మధ్య ఉన్న 9వ నెంబర్ తూములు సక్రమంగా లేవు. ఇక్కడ షట్టర్లు లేకపోవడంతో కేవలం రాళ్లను అడ్డుపెట్టారు. దీంతో నీరంతా వృథాగా ఇతర ప్రాంతాలకు వెళ్లే అవకాశం ఉంది. సూర్యాపేట శివారులోని అంజనాపురి కాలనీ వరకు తూములు అస్తవ్యస్తంగా ఉన్నాయి. అంజనాపురి నుంచి ఉన్న ఫీడర్‌ఛానల్ కాల్వలో మొద్దులు ఉన్నాయి. దీంతో నీరు ఆవాసాల ఎదుట నుంచి వెళ్లే అవకాశం ఉందని పట్టణవాసులు చెబుతున్నారు. షట్టర్లు లేని కారణంగా తూముల నుంచి నీరు చాలా వరకు వృథాగా పోతుందని, నివారణ చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. వృథా ఎక్కువైతే చెరువు నిండటానికి ఎక్కువ రోజులు పట్టే అవకాశం ఉంటుందని చెబుతున్నారు.

ఏడు రోజుల్లో సద్దుల చెరువు నింపుతాం.

-నవనీత్‌కాంత్, మూసీ డీఈ

వినాయక నిమజ్జనానికి సూర్యాపేటలోని సద్దుల చెరువును నింపాలని కలెక్టర్ ఆదేశాల మేరకు మూసీ నీటిని విడుదల చేశాం. ఏడు రోజుల్లో చెరువు నింపుతాం. పిన్నాయిపాలెంలోని నల్లచెరువు మీదుగా పిల్లలమర్రికి నీరు చేరుతుంది. అక్కడి నుంచి నేరుగా సద్దుల చెరువుకు రానుంది. షటర్లు లేని తూముల వద్ద సిమెంట్ బస్తాలు వేయిస్తాం. చుక్కా నీరు వృథా కానివ్వం.

గోరక్షణను బాధ్యతగా స్వీకరించాలి



గోరక్ష చట్టంపై అవగాహన సదస్సులో మాట్లాడుతున్న రాజాసింగ్

భువనగిరి ఆబాది, న్యూస్‌టుడే: ప్రతి హిందూ కార్యకర్త గోరక్షణను బాధ్యతగా స్వీకరించాలని గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ అన్నారు. పట్టణంలోని బుధవారం వైఎస్ఆర్ గార్డెన్‌లో హిందూ దేవాలయ పరిరక్షణ సమితి తెలంగాణ ఆధ్వర్యంలో నిర్వహించిన గోరక్ష చట్టంపై అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. గోసంరక్షణను ఏవిధంగా చేయాలనే విషయాలపై గోసంరక్షణ చట్టం గూర్చి ఆయన గోరక్షకులకు వివరించారు. కన్నతల్లిలాంటి గోమాతను రక్షించడం ప్రతి హిందువు ప్రథమ కర్తవ్యమన్నారు. గోరక్షకులపై పోలీసులు అనేక కేసులు పెడుతున్నారని ఆకేసులకు భయపడేదిలేదన్నారు. గోరక్షణ కోసం పోలీసులు చేయలేని పనిని గోరక్షణ కార్యకర్తలు చేస్తున్నవారిని ఆయన అభినందించారు. వినాయక చవితి సందర్భంగా హైదరాబాద్‌కు ఆంధ్రా, ఒడిశాల నుంచి వస్తున్న గోవులను రాకుండా చర్యలు తీసుకోవాలని ఆయన పోలీసులను కోరారు. ఇప్పటికైన రాష్ట్ర ప్రభుత్వ గోరక్షణ విషయంలో తమ చిత్తశుద్ధిని నిరూపించుకోవలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ సుర్వి లావణ్య, హిందూ దేవాలయ పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు కట్టెగొమ్ముల రవీందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి రచ్చ సురేష్, సంయోజక కార్యదర్శి పబ్బొజు శ్రీనివాసు, పుల్లెల శివ, భోదానంద స్వామి, రంగి రామకృష్ణ, సూదగాని రవికుమార్, సోలిసురం శ్రీకాంత్‌రెడ్డి, లలిత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఐఏఎస్ ట్రైనీల సందర్శన


ఆలయోద్యోగులు నిర్వహించిన శ్రమదానం ప్రాంగణంలో ఐఏఎస్ ట్రైనీలు

యాదగిరిగుట్ట, న్యూస్‌టుడే: యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి పుణ్యక్షేత్రాన్ని ఐఏఎస్ ట్రైనీల బృందం బుధవారం సందర్శించింది. బాలాలయంలోని శ్రీ లక్ష్మీనరసింహస్వామిని దర్శించి పూజలు చేపట్టారు. ఆలయ విస్తరణ కోసం జరుగుతున్న పనులను ఐఏఎస్ ట్రైనీలు సందర్శించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. 'యాడా' ఉపాధ్యక్షుడు కిషన్‌రావుతో సమావేశమై పలు అంశాలపై చర్చించారు. మల్లాపురంలో ఆలయోద్యోగులు చేపట్టిన శ్రమదానం ప్రాంగణాన్ని సైతం సందర్శించి పలు అంశాలపై ఆలయ అధికారులతో చర్చించారు.

తెరముందు యంత్రాంగం.. తెరవెనుక మంత్రాంగం

(మొదటి పేజీ తరువాయి) రెవెన్యూ అధికారులు ఆ భూమిలో పంటలు సాగు చేసుకోవద్దని సదరు రైతుల్ని హెచ్చరించినా వారు వినడం లేదని అధికారులు 'ఈనాడు'కు వెల్లడించడం విశేషం. ఈ భూమిని మామిళ్లగూడెంకు సంబంధించిన కొందరు రైతులు ఆక్రమించుకొని సాగు చేసుకుంటున్నారు. ఈ భూమి అన్యాక్రాంతం అవుతుండడంపై నాలుగేళ్ల కిందట కొందరు అధికారులను ప్రశ్నించగా వారు రెవెన్యూ దస్త్రాలను పరిశీలించి ఈ భూమి ఫక్రుద్దిన్, పీర్లమాన్యం పేరుతో ఉందని గ్రామస్థులకు వెల్లడించారు. తీరా అన్ని వివరాలు సేకరించగా... సదరు ఫక్రుద్దిన్‌కు ఈ భూమికి ఎలాంటి సంబంధం లేదని తేటతెల్లమైంది. గుండ్లపల్లి పక్కనే ఉన్న మామిళ్లగూడెం గ్రామం నల్గొండ పురపాలికలో ఉంది. పురపాలికలో ఎకరా దాదాపు రూ.35 లక్షల నుంచి రూ.40 లక్షల వరకు ధర పలుకుతోంది. ఈ లెక్కన ఈ భూమి ధర దాదాపు రూ.ఐదు నుంచి రూ.ఆరు కోట్ల విలువ చేస్తుంది. ఈ భూమి అన్యాక్రాంతమైన విషయం సదరు రెవెన్యూ ఉన్నతాధికారులకు తెలిసినా వారు ఈ విషయంపై స్పందించడం లేదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. అయితే దీని వెనక కొందరు పెద్దల హస్తం ఉందనే వాదనలూ ఉన్నాయి. అందువల్లే రెవెన్యూ అధికారులు ఈ భూమి విషయంలో మీనమేషాలు లెక్కిస్తున్నారని గ్రామస్థులు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా ఈ భూమిలో సాగుచేసుకుంటున్న వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

పండ్ల మార్కెట్ పరిశీలన

తెలంగాణ సర్కారు నల్గొండ జిల్లా కేంద్రంలో బత్తాయి పండ్ల మార్కెట్ ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. దీనికి స్థలం కొరత ఏర్పడటంతో నల్గొండ జిల్లా కేంద్రం చుట్టుపక్కల ఉన్న పలు ప్రభుత్వ స్థలాలను గతంలో అధికారులు పరిశీలించారు. ఈ 16.21 ఎకరాల భూమిని కూడా పరిశీలించినా ఇతర స్థలాలతో పోలిస్తే పట్టణానికి దూరమవడంతోపాటు భారమయ్యే అవకాశం ఉందని గ్రహించి దీనిని పరిగణలోకి తీసుకోలేదు. అప్పుడు ప్రభుత్వ భూమిగా పండ్ల మార్కెట్‌కు పరిగణలోకి తీసుకున్న అధికారులు... ఇప్పుడు అది ప్రభుత్వ భూమి అని చెప్పడానికి తగినన్నీ ఆధారాలు రెవెన్యూ గెజిట్లో లేవని చెప్పడం గమనార్హం.

చర్యలు తీసుకుంటాం

ఈ భూమిపై త్వరలోనే సమగ్ర సర్వే చేపడతాం. ప్రభుత్వ భూములను ఆక్రమించుకున్న వారెవరైనా నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటాం.

– సి.నారాయణరెడ్డి, సంయుక్త కలెక్టరు(జేసీ), నల్గొండ.

ముచ్చటగా మూడు.. సేవలందేను చూడు

- సత్వర సేవలకు గోదాముల విభజన అవసరం
- క్షేత్రస్థాయిలో విద్యుత్తు వినియోగదారులకు ఇక్కట్లు
- సర్కిళ్లపై రవాణా భారం

భువనగిరి టౌన్ – న్యూస్‌టుడే

విద్యుత్తు సంస్థ గోదాముల విభజనలో జాప్యం కారణంగా క్షేత్రస్థాయిలో వినియోగదారులకు సత్వర ఫలాలు అందడంలేదు. ఉమ్మడి నల్గొండ జిల్లా నుంచి విడివడి కొత్త జిల్లాలుగా ఏర్పడినప్పటికీ అప్పట్లో విభజన జరగలేదు. కొత్త జిల్లాల్లో అన్ని విభాగాలను ఏర్పాటుచేసి పాలనాపరంగా ప్రజలకు, సంస్థ ఉద్యోగులకు వెసులుబాటు కల్పించినప్పటికీ సామగ్రి గోదాముల విభజన జరగకపోవడం గమనార్హం. కొత్త జిల్లాల్లోని యంత్రాంగం ఇప్పటికీ ఉమ్మడి జిల్లా సామగ్రి గోదాములను ఆశ్రయించాల్సి వస్తోంది. ఫలితంగా ప్రజలకు సేవలు అందించడం, సామగ్రి తరలించడంలో తీవ్ర జాప్యం నెలకొంటోంది. దీంతో పనులు నత్తనడకన నడుస్తున్నాయి.

నల్గొండ గోదాం పరిధి

జిల్లాలు: నల్గొండ, యాదాద్రి భువనగిరి, సూర్యాపేట

విద్యుత్ డివిజన్లు: ఐదు

సెక్షన్లు: 59

ఇవీ ఇబ్బందులు


నల్గొండ జిల్లా నుంచి కొత్తగా యాదాద్రి భువనగిరి, సూర్యాపేట జిల్లాలు ఏర్పడ్డాయి. మూడు జిల్లాల పరిధిలో ఐదు విద్యుత్తు డివిజన్లు, 59 సెక్షన్లు ఉన్నాయి. ఒక్కో సెక్షన్ కింద సుమారు 40 నుంచి 48 గ్రామాలున్నాయి. సంస్థ ఆధ్వర్యంలోని 59 సెక్షన్లకు ఏచిన్న విద్యుత్తు వస్తువు కావాల్సి ఉన్నా నేటికీ ఉమ్మడి జిల్లా కేంద్రం నల్గొండలోని విద్యుత్తు గోదాముకు పరుగెట్టాల్సిందే. ఉన్న ఒక్క గోదామును కొత్త జిల్లాలకు విభజించిన పక్షంలో బాధలు తప్పే అవకాశం ఉంది. కొత్త విద్యుత్తు కనెక్షన్‌కు జారీ చేసే మీటరు, స్తంభాలు, తీగలు, కండెక్టర్లు, నియంత్రికలు, ఎర్త్ వైర్లు, రాడ్‌లు, కాసారాలు, స్టేవైర్‌తో పాటు పలు రకాల సామగ్రిని నేటికీ నల్గొండలోని గోదాము నుంచి తీసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. విద్యుత్తు సామగ్రి కోసం ఉమ్మడి జిల్లా పరిధి నుంచి నిత్యం సుమారు 25 మండలాల వారు నల్గొండకు వస్తుంటారు. తీసుకున్న సామగ్రిని సెక్షన్లకు తీసుకొచ్చేందుకు కనీసం రెండు రోజులు పడుతుంది. దీనికితోడు రవాణా భారంగా మారుతోంది. కొన్ని సందర్భాల్లో రవాణా ఛార్జీలను వినియోగదారుల నుంచి ఉద్యోగులు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. అత్యవసర సమయాల్లో సామగ్రి అందక సేవలు నిలిచిపోయిన సందర్భాలు అనేకం ఉన్నాయి. ఎంతో వ్యయప్రయాసలతో నల్గొండకు వెళ్లినప్పటికీ అవసరమున్న సామగ్రి గోదాములో లభించడంలేదని, ఒట్టి చేతులతో వెనుదిరగాల్సి వస్తోందని సంస్థ ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నల్గొండకు దగ్గరగా ఉన్న సెక్షన్లలోని ఉద్యోగులు ఎప్పటికప్పుడు తమకు అవసరమున్న సామగ్రిని తీసుకెళ్తుండటంతో. . దూరమున్న సెక్షన్లకు డిమాండ్ మేరకు సామగ్రి లభించడంలేదు.

విభజిస్తే ప్రయోజనం

కొత్త జిల్లాల్లో విద్యుత్తు సామగ్రి గోదామును ఏర్పాటుచేసిన పక్షంలో సంస్థ ఉద్యోగులు, వినియోగదారులకు ప్రయోజనం చేకూరే అవకాశం ఉంది. గోదాము ఏర్పాటుతో కొత్త పోస్టులు మంజూరయ్యే అవకాశం ఉంది. స్థానికులకు ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి లభించే అవకాశమూ ఉంది. ప్రస్తుతం నల్గొండ గోదాములో ఏడీఈ, ఏఈతో పాటు సబ్ ఇంజినీరు, ఇద్దరు ఎల్‌డీసీలు, ఐదుగురు కార్మికులు, 15 మంది రోజువారి కార్మికులకు పనిచేస్తున్నారు. కొత్తగా ఆయా జిల్లాలో గోదాము ఏర్పాటుచేస్తే ఇదే రీతిలో అక్కడ సిబ్బందిని నియమించవచ్చు. ఫలితంగా పలువురికి ఉపాధి అందే అవకాశముంది. నల్గొండ నుంచి సామగ్రి తరలించే భారం కూడా తగ్గుతుంది. క్షేత్రస్థాయిలో పనులు త్వరితగతిన జరిగే అవకాశం ఉంది. ఇప్పటికైనా సంస్థ అధికారులు క్షేత్రస్థాయిలో ఉన్న ఇబ్బందులను గుర్తించి గోదామును విభజించి వినియోగదారులకు సత్వరం సేవలు అందేలా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది.

దత్తాత్రేయకు వినతి పత్రం అందజేత

ముంబయి, న్యూస్‌టుడే: ముంబయిలోని లోకమాన్య తిలక్ టెర్మినస్ (ఎల్‌టీటీ) నుంచి కాకినాడ పోర్ట్‌కు తెలంగాణ రాష్ట్రంలోని నల్గొండ జిల్లా మీదుగా నడుస్తున్న(వారాంతపు రైళ్లను) రైళ్లను రామన్నపేట, చిట్యాల రైల్వే స్టేషన్‌లలో ఒకచోట ఆగేలా(స్టాప్ ఉండేలా) చొరవ చూపాలని ఉమ్మడి నల్గొండ జిల్లావాసుల ఐక్యవేదిక మహారాష్ట్ర అధ్యక్షుడు కమ్మమెట్టు దశరథ్, కేంద్ర కార్మికశాఖ సహాయ మంత్రి(స్వతంత్ర హోదా) బండారు దత్తాత్రేయకు వినతి పత్రం అందజేశారు. ముంబయి, ఉపనగరాలు, ఠానే, భివండీ, పుణె తదితర ప్రాంతాల్లో నివాసముంటున్న ఉమ్మడి నల్గొండ జిల్లాకు చెందిన వేలాది కుటుంబాలు స్వగ్రామానికి రాకపోకలు సాగించేందుకు గతంలో సూర్యాపేట, నార్కట్‌పెల్లి డిపోలకు చెందిన రెండు ఆర్టీసీ బస్సులు అందుబాటులో ఉండేవి. కొన్నాళ్ల క్రితం ఈ బస్సులను కూడా అధికారులు పూర్తిగా నిలిపివేశారు. దీంతో 17221, 17222 నంబరు గల(వారాంతపు రైళ్లు)రైళ్లు వారంలో ప్రతి బుధవారం, శనివారం, గురువారం, ఆదివారం తెలంగాణ రాష్ట్రంలోని నల్గొండ జిల్లా మీదుగా నడుస్తోన్నాయి. దీంతో ఈ ప్రాంతం ప్రజలు(లోక్‌మాన్య తిలక్ టెర్మినస్, కాకినాడ పోర్ట్) వారాంతపు రైళ్లలలోనే రాకపోకలు సాగిస్తున్నారు. సదరు రైళ్లు లోక్‌మాన్య తిలక్ టెర్మినస్ నుంచి సికింద్రాబాద్‌కు వెళ్లిన తర్వాత నేరుగా నల్గొండ రైల్వే స్టేషన్‌లో ఒక్కచోట మాత్రమే రెండు నిమిషాలు ఆగుతున్నాయి. ఈ కారణంగా మధ్య ప్రాంతాల్లో దిగవల్సిన ప్రయాణికులు సికింద్రాబాద్, నల్గొండ స్టేషన్లలోనే దిగాల్సి వస్తోంది. ఉమ్మడి నల్గొండ జిల్లా వ్యాప్తంగా ఏ గ్రామం వెళ్లాలన్నా నల్గొండ రైల్వే స్టేషన్లలో దిగి అక్కడ్నుంచి ప్రైవేటు వాహనాలు ఆశ్రయించి వెళ్లాల్సిందే. సుమారు 50-60 కి.మీల మేర వృథాగా ప్రయాణించవలసి వస్తోంది. పరిసర ప్రాంతాల్లో ఒక స్టాపులో ఆపితే ఇబ్బందులు తగ్గుతాయనే ఉద్దేశ్యంతోనే ఈ విషయాన్ని వినతి పత్రం ద్వారా మంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు ఐక్యవేదిక అధ్యక్షుడు కమ్మమెట్టు దశరథ్ పేర్కొన్నారు. రైళ్లను రామన్నపేట, చిట్యాల రైల్వే స్టేషన్లలో ఒకచోట కనీసం ఓ రెండు నిమిషాలైనా నిలిపేలా చర్యలు తీసుకోవాలని మంత్రికి విజ్ఞప్తి చేశామని దశరథ్ వెల్లడించారు. వినతి పత్రం స్వీకరించిన మంత్రి దత్తాంత్రేయ పూర్తి వివరాలు పరిశీలించి సమస్య పరిష్కారం దిశగా ప్రయత్నిస్తానని చెప్పినట్లు ఆయన తెలిపారు.



వినతిపత్రం అందిస్తున్న కమ్మమెట్టు దశరథ్ తదితరులు

మట్టిని వదిలేసి.. మాటలు మార్చేసి

(మొదటి పేజీ తరువాయి) గణేష్‌లు వాడవాడల్లో కొలువుదీరే ప్రణాళిక నూరు శాతం అమలయ్యేది. మొక్కుబడి సమావేశాలు తప్పితే మట్టి గణపతిలపై ప్రచారం చేయాలన్న దిశగా జిల్లా ఉన్నతాధికారులు చొరవచూపడం లేదన్న ఆరోపణలున్నాయి. గతేడాది జిల్లా అధికార యంత్రాంగం మట్టి గణపతుల వాడకంపై పలు సమావేశాలు నిర్వహించింది. ఈసారి నల్గొండ, యాదాద్రి జిల్లాల్లో ఎక్కడా ఉన్నతాధికారులు మట్టి గణపతుల వాడకంపై సమావేశాలు నిర్వహించకపోవడం గమనార్హం. ఈ రెండు జిల్లాలతో పోలిస్తే సూర్యాపేట జిల్లా యంత్రాంగం చొరవ అభినందనీయమే.

విద్యాశాఖ చొరవ

నల్గొండ పట్టణంలో విద్యాశాఖ ఆధ్వర్యంలో జాతీయ హరిత దళాల(ఎన్‌జీసీ) విద్యార్థులను మట్టి గణపతుల వాడకం, తయారీపై ఈనెల 21న ఒక రోజు శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఇలా జిల్లాలోని అన్ని పాఠశాలల్లో విద్యార్థులకు తగిన విధంగా ప్రచారం కల్పిస్తే మరింత మెరుగైన ప్రయోజనం ఉండేదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. వినాయకచవితి సందర్భంగా శాంతి సమావేశం నిర్వహించిన ఉన్నతాధికారులు మట్టి గణపతుల వినియోగంపై ప్రచారాన్ని మరిచారన్న విమర్శలున్నాయి. భువనగిరి యాదాద్రి జిల్లాలోనూ పర్యావరణ హిత మట్టి గణపతులపైన ఉన్నతాధికారులు ప్రచారం నిర్వహించలేదు. ఒకవైపు తెలంగాణ సర్కారు పర్యావరణాన్ని, నీటి వనరులను కలుషితం చేసే పీవోపీ విగ్రహాలు వాడకుండా ప్రజలకు అవగాహన కార్యక్రమాలు కల్పించాలని చెబుతున్నా క్షేత్రస్థాయిలో మాత్రం పరిస్థితి ఇందుకు భిన్నంగా ఉంది.

పీసీబీ అధికారులకు బాధ్యత లేదా?

పర్యావరణ పరిరక్షణపైన ప్రచారం చేయాల్సిన కాలుష్య నియంత్రణ మండలి (పీసీబీ) అధికారులు ఈ దిశగా చొరవ చూపడం లేదు. మట్టి గణపతుల వాడకంపై గతంలో కరపత్రాలతో పీసీబీ అధికారులు ప్రచారం చేసి పీవోపీ వాడకం వల్ల నీటి వనరులు ఎలా కలుషితం అవుతాయో తెలియజెప్పేవారు. ప్రస్తుతం ఎక్కడా అలాంటి దాఖలాలు లేవు. వారు ప్రజలకు అందుబాటులోనే ఉండరని స్వయంగా జిల్లా ఉన్నతాధికారులే పెదవి విరచడం వారి పనితీరుకు నిదర్శనంగా చెబుతున్నారు. ప్రస్తుతం మూడు జిల్లాల్లో కలిపి దాదాపు 25వేల వరకు విగ్రహాలు ప్రతిష్టిస్తారని అధికారుల అంచనా. ఇంట్లో, చిన్న చిన్న వీధుల్లో ప్రతిష్టించే విగ్రహాలు వీటికి అదనం. ఇవన్నీ నీటి వనరుల్లో చేరితే అవి తాగడానికి పనికిరాని పరిస్థితి. ముందునుంచి ప్రణాళిక పరంగా అధికార యంత్రాంగం వ్యవహరిస్తే ఈ పరిస్థితి వచ్చేది కాదని పర్యావరణ నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

29న ప్రజాసంఘాల ఐక్యవేదిక ఆవిర్భావ సభ

మోత్కూరు, న్యూస్‌టుడే: ఈనెల 29న భువనగిరిలోని ఏఆర్ గార్డెన్లో తెలంగాణ సామాజిక ప్రజాసంఘాల ఐక్యవేదిక జిల్లా ఆవిర్భావ సభ నిర్వహించనున్నట్లు టీమాస్ ఫోరం రాష్ట్ర ఆఫీస్ బేరర్ కూరపాటి రమేష్ తెలిపారు. బుధవారం మోత్కూరులో రౌండ్‌టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. కూరపాటి రమేష్ మాట్లాడుతూ 93 శాతంగా ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఎంబీసీ, మైనార్టీ, పేదల సంక్షేమాన్ని ప్రభుత్వం విస్మరించిందని విమర్శించారు. భువనగిరిలో నిర్వహించనున్న ఆవిర్భావ సభకు గ్రామాల నుంచి పెద్దఎత్తున ప్రజలు హాజరుకావాలని కోరారు. ఈ సమావేశంలో రైతు సంఘం నాయకులు సదానందరావు, బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గడ్డం నర్సింహా, శ్రీనివాస్, చేనేత సంఘం అధ్యక్షుడు బిక్షపతి, దేవేంద్రాచారి పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలని రాస్తారోకో



మృతదేహంతో రాస్తారోకో చేస్తున్న బంధువులు, గ్రామస్థులు

తిప్పర్తి, న్యూస్‌టుడే: విద్యుత్తు అధికారుల నిర్లక్ష్యంతోనే గంగన్నపాలేనికి చెందిన కవుటి జానయ్య మృతిచెందారని ఆరోపిస్తూ అతడి బంధువులు, గ్రామస్థులు బుధవారం అద్దంకి-నార్కట్‌పల్లి రాష్ట్రీయ రహదారిపై తిప్పర్తిలో మృతదేహంతో రాస్తారోకో చేపట్టారు. జానయ్య(50) మంగళవారం ఇంట్లో తీగపై బట్టలు ఆరేస్తుండగా విద్యుదాఘాతానికి గురై మృతిచెందారు. బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని అధికారులను డిమాండ్ చేశారు. రాస్తారోకో వల్ల వాహనాలు రాకపోకలు స్తంభించాయి. ఎస్సై శివకుమార్ సర్దిచెప్పడంతో రాస్తారోకో విరమించారు. బాధిత కుటుంబానికి న్యాయం చేస్తామని విద్యుత్తు అధికారులు హామీ ఇచ్చారు.